ప్రజాశక్తి
బుధవారం 10 జులై 2024 8 పేజీలు
గుంటూరు పల్నాడు





కలగా పై ఓవర్లు

20 ఏళ్లుగా ముందుకెళ్లని ప్రతిపాదనలు - గుంటూరులో తీరని ట్రాఫిక్ కష్టాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో ట్రాఫిక్ కష్టాలు తీర్చేందుకు రైల్వే ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలనే ప్రతిపాదనలు 20 ఏళ్లుగా కాగితాలకే పరిమితమయ్యాయి. నగరం విస్తరిస్తున్నా, జనాభా పెరిగినా అందుకు తగ్గట్టుగా అభివృద్ధి జరగడం లేదు. నగర జనాభా 10 లక్షలు దాటినా ఇంకా 3 లక్షల జనాభా ఉన్న సమయంలో ఉన్న సౌకర్యాలే కొనసాగుతున్నాయి. ప్రజా ప్రతినిధులు, మంత్రులు వీటిపై సమీక్షలు చేయడం, తరువాత వీటిని వదిలివేయడంతో వీటి నిర్మాణాలు కలగా మిగిలాయి.



శంకర్ విలాస్ బ్రిడ్జిపై ట్రాఫిక్

గుంటూరులోని శంకర్ విలాస్, శ్యామలానగర్, సీతానగర్, రెడ్డిపాలెం ఇన్నర్ రింగ్ రోడ్డు, సంజీవయ్యనగర్, నెహ్రూనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మించాలని ప్రతిపాదనలు రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వీటి నిర్మాణంపై దృష్టిసారించి అధికారులతో సమీక్ష చేశారు. అయితే ఇప్పటి వరకు ఏ బ్రిడ్జికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వద్ద ప్రతిపాదనలకు ఆమోదం లభించలేదని అధికారుల సమీక్షలో వెల్లడైంది. వీటికి సంబంధించి అనుమతి వచ్చి

2లో

కిడ్నీ అమ్మకంలో ఐదుగురిపై కేసు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు కెవిపి కాలనీకి చెందిన గార్లపాటి మధుబాబు నుంచి కిడ్నీని అక్రమంగా తీసుకున్న వ్యవహారంలో ఐదుగురిపై నగరం పాలెం పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై బాధితుడి మధుబాబు నుంచి అధికారులు వాంగ్మూలం నమోదు చేశారు. కిడ్నీ తీసుకున్న వెంకటస్వామికి, మధుబాబుకు బంధుత్వమేమీ లేదని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. నిబంధనల ప్రకారం రక్తసంబంధీకులు, ముఖ్యమైన బంధువులకే కిడ్నీ దానం ఇవ్వవచ్చు. ఈ కేసులో విజయవాడకు చెందిన శరత్‌చంద్ర కిడ్నీ ఆస్పత్రి వైద్యులు శరత్, కిడ్నీ అమర్చుకున్న వెంకటస్వామి, బ్రోకర్లు బాషా, వెంకట్‌తోపాటు సుబ్రహ్మణ్యం అనే మరో వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

చిన్న వయస్సులోనే తల్లిదండ్రులను కోల్పోయిన మధుబాబు 12 ఏళ్ల క్రితం ఒక యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. పల్నాడు జిల్లా దాచేపల్లికి చెందిన మధుబాబు కరోనాకు ముందు వ్యాపారాలు చేసి నష్టపోయారు. దాదాపు రూ.ఐదారు లక్షలు అప్పులు చేశారు. వీటిని తీర్చడానికి లోన్ యాప్‌ల ద్వారా కూడా భారీగా అప్పులు చేశారు. మొత్తం అప్పులు రూ.10 లక్షలకు చేరడంతో అతని స్నేహితుడైన బాషా... వెంకట్ ద్వారా కిడ్నీ అమ్మితే రూ.30 లక్షలు ఇప్పిస్తామని నమ్మబలికారు. తీరా రూ.లక్షన్నర చేతిలో పెట్టి కిడ్నీ తీసుకున్నారని బాధితుడు మధుబాబు అధికారుల విచారణలో చెప్పారు. తనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారని, తనను మోసం చేశారని మధుబాబు వాపోయారు. ఈ ఘటనపై విచారణకు జిల్లా అధికారులను హోంమంత్రి అనిత ఆదేశించారు. దీంతో అధికారులు వేగంగా స్పందించి బాధితుడి వాంగూల్మం నమోదు చేసి, నిందితులపై కేసు నమోదు చేశారు.

ప్రత్యేక బృందాలతో దర్యాప్తు : డిఎస్‌పి

కిడ్నీ విక్రయం కేసులో ప్రత్యేక బృందాలను నియమించి దర్యాప్తును ముమ్మరం చేస్తామని గుంటూరు పశ్చిమ డిఎస్‌పి కె.వి.మహేష్ మంగళవారం మీడియాకు తెలిపారు. బాధితుడు మధుబాబు ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసును గుంటూరు నుంచే దర్యాప్తు చేయాలా? విజయవాడ పోలీసులకు బదిలీ చేయాలా? అనేది కూడా ఆలోచిస్తున్నామన్నారు.

నిబంధనల మేరకే ఇసుక విక్రయాలు

- అందుబాటులో 2.39 లక్షల మెట్రిక్ టన్నులు
- కొండమోడులో స్టాక్ పాయింట్‌ను పరిశీలించిన పల్నాడు జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి -పల్నాడు జిల్లా

ఇసుక విక్రయాల్లో ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు హెచ్చరించారు. రాష్ట్రంలో ఉచిత ఇసుక పాలసీ మంగళవారం ప్రారంభమైన నేపథ్యంలో రాజుపాలెం మండలం కొండమోడులోని ఇసుక స్టాక్ పాయింట్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఇసుక డిపో నందు పర్మిట్ వివరాలు, చెల్లించిన రుసుం, చెల్లింపు విధానాన్ని పరిశీలించి రెవెన్యూ సిబ్బంది, ఇసుక కొనుగోలుకు వచ్చిన ప్రజలతో మాట్లాడారు. కొండమోడు ఇసుక డిపో వద్ద కేవలం నామమాత్రపు పన్నులు, నిర్వహణ ఖర్చులు కలిపి టన్నుకు రూ.563 (ఇసుక రీచ్ నుండి స్టాక్ పాయింట్‌కు చేరే ఒక్కో కిలోమీటర్‌కు రూ.4.99 కలిపి) డిజిటల్ పేమెంట్ ద్వారా మాత్రమే పర్మిట్ ఇచ్చి ప్రజలకు అందిస్తామని చెప్పారు. జిల్లాలో 4 స్టాక్ పాయింట్లు, 2 డిపోల్లో ఇసుక నిల్వలు ఉంచామని, 2.39 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని తెలిపారు. స్టాక్ పాయింట్‌లో టన్నుకు రూ.193 డిజిటల్ పేమెంట్ చెల్లించి రవాణా పత్రం పొందాలన్నారు. ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఇసుక డిపోల నుండి ఇసుకను



కొనుగోలు చేసుకోవచ్చని, ఒకరికి గరిష్టంగా రోజుకు 20 టన్నుల ఇసుకే అమ్ముతారని స్పష్టం చేశారు. కొనుగోలుదారులు ఆధార్ కార్డును తప్పనిసరిగా చూపించాలన్నారు. ఇసుకను అక్రమంగా నిల్వ ఉంచినా, ప్రైవేటు వ్యక్తులకు విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిశీలనలో జిల్లా మైనింగ్ అధికారి నాగిని, సత్తనపల్లి ఆర్‌డిఒ బి.మురళీకృష్ణ, తహశీల్దార్‌లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.




తనిఖీలు చేస్తున్న అధికారులు

రూ.55.6 లక్షల బయోలు, ఎరువులు సీజ్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లాలో వ్యవసాయశాఖ రాష్ట్రస్థాయి తనిఖీ బృందాలు విస్తృతంగా తనిఖీ చేపట్టాయి. గుంటూరు నగరంతోపాటు, తెనాలి, మేడికొండూరు, ప్రత్తిపాడు, మంగళగిరి మండలాల పరిధిలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నిల్వ కేంద్రాల్లో ఈ తనిఖీలు చేశారు. రూ.55.6 లక్షల విలువైన 6.88 టన్నుల బయోఉత్పత్తులు, 219 టన్నుల ఎరువులు విక్రయం నిలుపుదల చేశారు. తనిఖీలు కొనసాగుతాయని కోనసీమ ఎడిఎ కె.నాగేశ్వరరావు తెలిపారు. తనిఖీల్లో ప్రకాశం జిల్లా ఎడిఎ బి.బాలాజీనాయక్, నెల్లూరు సిఐ సి.మాణ్యిరావు, గుంటూరు సిఐ ఎస్.శ్రీనివాసరెడ్డి, వ్యవసాయాధికారులు గౌతమ్ ప్రసన్న పాల్గొన్నారు.



డిప్యూటీ డిఎంహెచ్‌ఒకు వివరాలు చెబుతున్న సిబ్బంది, నేతాజి

వైద్యాధికారి వేధింపులపై విచారణ

ప్రజాశక్తి - కొల్లిపర : మండలంలోని మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందిని వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక వేధిస్తున్నారనే ఫిర్యాదులపై డిప్యూటీ డిఎంహెచ్ఒ అన్నపూర్ణ విచారణ చేపట్టారు. ఆస్పత్రిని మంగళవారం సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. డాక్టర్ ప్రియాంక వేధింపులపై బాధిత సిబ్బంది సిఐటియు ఆధ్వర్యంలో ఇటీవలే జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు చేశారు. దీనిపై డిప్యూటీ డిఎంహెచ్ఒ విచారణ చేపట్టి మున్నంగి పిహెచ్ఇ సిబ్బందితో సమావేశమయ్యారు. వైద్యాధికారి తమను పరుషంగా మాట్లాడుతున్నారని, మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని సిబ్బంది తెలిపారు. వీరికి మద్దతుగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి పలు విషయాలను చెప్పారు. వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని డిప్యూటీ డిఎంహెచ్ఒ తెలిపారు.



పరిశ్రమలపై గుంటూరు కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీసీ హాల్‌లో పరిశ్రమలశాఖ, చేనేత, జౌళిశాఖ, కార్మికశాఖ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్, అగ్నిమాపక శాఖ, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణబోర్డు, ఆంధ్రప్రదేశ్ ఖాదీ, విఐబోర్డు, ఎపిఐఎసి శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధ్యక్షతన జిల్లా కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. అన్ని శాఖల్లో ఉన్న సిబ్బంది వివరాలు, విధులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఆర్.వెంకటరావు మాట్లాడుతూ జిల్లాలో స్పిన్నింగ్, జిన్నింగ్ మిల్లులు ఎక్కువగా వున్నాయని, జిల్లాలో ఏడు మెగా యూనిట్లు ఉన్నాయని, మైక్రో స్మాల్ యూనిట్లు 61 వేల వరకు ఉన్నాయని వివరించారు. మైక్రో ఎంటర్‌ప్రెన్యూర్‌కు ప్రాజెక్ట్ గైడ్ చేస్తామన్నారు. బ్యాంకర్స్‌తో, లైన్ డిపార్ట్మెంట్స్‌తో మాట్లాడి రుణాలు మంజూరు చేయింస్తామని చెప్పారు. జిల్లాలో టుబాకో,

2లో

పరిశ్రమలపై గుంటూరు కలెక్టర్ సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

కోకాకోలా, జోసిల్, కాంటినెంటల్ కాఫీ పరిశ్రమలు, గుంటూరు ఆటోనగర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్స్ ఉన్నాయన్నారు. ప్రభుత్వం పరిశ్రమలను అభివృద్ధి చేయటానికి, కాంప్లెక్స్‌లు కట్టడానికి భూమి అందుబాటులో లేదని తెలిపారు. కార్మికశాఖ డిప్యూటీ లేబర్ కమిషనర్ గాయత్రిదేవి మాట్లాడుతూ జిల్లాలో వివిధ పరిశ్రమలు, ఇతర ప్రదేశాల్లో పని చేస్తున్న బాల కార్మికులను గుర్తించి వారిని బయటకు తెచ్చి యాజమాన్యంపై కేసులు పెడతామన్నారు. కార్మికులకు ప్రమాదాలు జరిగినపుడు నష్టపరిహారం ఇప్పించడం, లేబర్‌సెస్ వసూలు చేసి బోర్డుకు జమ చేస్తామన్నారు.

గత ఐదేళ్లలో ఫ్యాక్టరీల్లో, బాయిలర్స్‌లో ఏమైనా మేజర్ ఇన్సిడెంట్స్ జరిగాయా అని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్ శ్రీనివాసరావును జిల్లా కలెక్టర్ అడుగగా.. పెద్ద ఘటనలేమీ జరగలేదని, కోల్డ్ స్టోరేజ్‌లలో జరుగుతున్నాయని తెలిపారు. గుంటూరులో 140కుపైగా కోల్డ్ స్టోరేజ్‌లు ఉన్నాయని, అగ్నిప్రమాదం జరిగిన వెంటనే తెలియజేసే మెకానిజం అందుబాటులో లేదని చెప్పారు. జిల్లా అగ్నిమాపక శాఖాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో పెద్ద అగ్నిప్రమాదాలు జరుగలేదని చెప్పడంతోపాటు జిల్లాలో ఫైర్ ఇంజన్స్ ఎక్కడెక్కడ ఉన్నాయో తెలిపారు. చేనేత, జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వనజ మాట్లాడుతూ జిల్లాలో 72 సొసైటీలు ఉన్నాయని, ఒక్కొక్క సొసైటీలో వందమంది నమోదై ఉన్నాయని తెలిపారు. మంగళగిరి, తెనాలి, ఫిరంగిపురం, చేబ్రోలు తదితర ప్రాంతాల్లో సొసైటిలు ఉన్నాయన్నారు. మంగళగిరిలో 10 వేల కార్మికులు చేనేత పరిశ్రమపై ఆధారపడి ఉన్నారన్నారు. హ్యాండ్‌లూమ్స్ వర్క్‌షెడ్స్ కట్టడానికి కట్టడానికి స్థలం లేకపోతే మంగళగిరి రాజీవ్ గృహకల్ప వద్ద వర్క్‌షెడ్స్ నిర్మించినట్లు తెలిపారు. రత్నాల చెరువు ప్రాంతంలో 400 మంది చేనేత కార్మికులున్నారని, వారికి షెడ్స్ నిర్మించుకోవడానికి స్థలం కేటాయించాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ఎపిఐఐసి డి.జెడ్.ఎన్ జీవన్ మాట్లాడుతూ గుంటూరు ఆటో నగర్‌లో 1634 యూనిట్లు ఉన్నాయని, మంగళగిరి ఆటో నగర్ 324 యూనిట్లు ఉన్నాయని, ఆరు ఐటీ కంపెనీలు ఉన్నాయని వివరించారు. పొన్నూరు ఆటోనగర్‌కు 20 ఎకరాల స్థలం గుర్తించామన్నారు. కార్యక్రమంలో డిడి ఇండస్ట్రీస్ ఎం.సుధాకర్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సుభాని, కాలుష్య నియంత్రణ బోర్డు ఈఈ ఎం.నారాయణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



పుస్తకాలు, విద్యా ఉపకరణాలతో విద్యార్థులు

నోట్ పుస్తకాలు, విద్యా ఉపకరణాలు పంపిణీ

ప్రజాశక్తి - చేబ్రోలు : మండలంలోని చీలిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హాండ్స్ ఫ్రం హెవెన్ సంస్థ విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాలు, ఇతర విద్యా ఉపకరణాలను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఇఒ ఏవీహెచ్ ప్రసాద్ మాట్లాడుతూ సాటివారికి సహాయం చేసే మంచి గుణాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలని అన్నారు. అందరూ బాగా చదువుకోవాలని, సామాజికంగా, ఆర్థికంగా అభ్యున్నతి సాధించాలని ఆకాంక్షించారు. ఈ పాఠశాలలో అంకిత భావం కలిగిన ఉపాధ్యాయులను చూసి ఎనిమిదేళ్ల నుండి ప్రతి ఏటా విద్యార్థులకు విద్య ఉపకరణాలు సమకూరుస్తున్నట్లు చెప్పారు. దాతలు కూడా ఇదే పాఠశాలలో చదువుకుని ప్రభుత్వ ఉద్యోగులం అయ్యారని, ఆ తరువాత సంస్థను స్థాపించి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అభినందనలు తెలిపారు. హెచ్ఎం తహీరున్నీసా మాట్లాడుతూ ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు కూడా భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదిగి ఇతరులకు సహాయ పడాలని చెప్పారు. కార్యక్రమంలో ఎ.భద్రావతి, విజయరాజు, కె.ఝాన్సీ, సునీత, దాతలు, స్థానికులు పాల్గొన్నారు.

కలగా ఫ్లై ఓవర్లు

(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణాలు పూర్తయ్యేసరికి ఎంతకాలం పడుతుందనేదీ ప్రశ్నార్థకంగా మారింది. 75 ఏళ్లక్రితం నిర్మించిన శంకర్‌విలాస్ ఆర్‌వోబి స్థానంలో నూతన బ్రిడ్జి నిర్మించడమా? లేదా పైన మరో వంతెన నిర్మించడమా? పక్కనే రెండు లైన్లు వేర్వేరుగా అనుసంధానంగా బ్రిడ్జిలు నిర్మించడమా అనే అంశంపై స్పష్టత రాలేదు. ఇందుకు సంబంధించిన డిపిఆర్ తయారీకి అనుమతిచ్చినా పూర్తి కాలేదు.

గుంటూరు టూ టౌన్ నుండి ఒన్ టౌన్‌కు వెళ్లేందుకు తీవ్ర ట్రాఫిక్ నుంచి బయటపడటానికి 30 నిమిషాలు పడుతుందని అధికారులు అంచనావేశారు. నాలుగు లైన్ల బ్రిడ్జి నిర్మాణంకు రూ.198 కోట్ల ఖర్చు అవుతుందని ప్రాథమికంగా అంచనాలను రూపొందించారు. ఆర్అండ్‌బి అధికారులు రైల్వే, మునిసిపల్ అధికారులతో సమన్వయం చేసుకుని ఈ బ్రిడ్జిని పూర్తి చేయాల్సి ఉంది. గుంటూరు-నల్లపాడు సెక్షన్‌లో శ్యామలానగర్ రైల్వేగేటు స్థానంలో ఆర్‌యూబి ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినా అధికారులు ఆర్‌వోబికే మొగ్గు చూపారు. ఇందుకోసం రూ.147 కోట్లతో అంచనాలు రూపొందించారు. పట్టాభిపురం, శ్యామలానగర్, ఎన్‌జివో కాలనీ, హౌసింగ్ బోర్డు వాసులకు ఈ బ్రిడ్జి బాగా ఉపయోగపడుతుంది. గుంటూరు నుంచి సత్తెనపల్లి, నర్సరావుపేట మార్గాల వైపు వెళ్లే వారికి ఈ గేటు వద్ద నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుంది. దీంతో ఈ బ్రిడ్జి వల్ల చాలా ప్రాంతాలకు చెందిన ప్రజలకు వెసులుబాటు కలుగుతుంది. సీతానగర్ రైల్వేగేటు వద్ద కూడా రూ.140 కోట్ల అంచనాలతో మరో ఆర్‌వోబిని ప్రతిపాదించారు.



ఇన్నర్ రింగురోడ్డులోని రెడ్డిపాలెం రైల్వే గేటు వద్ద ట్రాఫిక్

గుంటూరు-విజయవాడ-తెనాలి మార్గంలో వెళ్లే వారికి ఈ బ్రిడ్జి ఉపయోగపడుతుంది.

మహాత్మాగాంధీ ఇన్నర్ రింగ్ రోడ్డులో రెడ్డిపాలెం వద్ద ఆర్‌వోబి నిర్మాణానికి 2014 నుంచి ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి. రూ.129 కోట్లతో గుంటూరు-నంబూరు మార్గంలో రైల్వేగేటుపై బ్రిడ్జి నిర్మాణం వల్ల విజయవాడకు వెళ్లే వారికి చాలా సమయం కలిసి వస్తుంది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రయాణించే వాసులకు సంజీవయ్య నగర్ గేటు వద్ద రూ.120 కోట్లతో ఆర్‌వోబి, నెహ్రూనగర్ రైల్వే గేటువద్ద రూ. 95 కోట్లతో మరో ఆర్‌వోబి నిర్మాణానికి చాలా కాలంగా ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి. అంతేగాక నందివెలుగు మార్గంలో గుంటూరు-తెనాలి రైల్వే సెక్షన్‌లో గుంటూరు-హనుమాన్‌పాలెం రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న ఆర్‌వోబి చాలా కాలంగా మందగమనంగా కొనసాగుతోంది. రూ.280 కోట్ల అంచనాలతో చేపట్టిన నిర్మాణం అసంపూర్తిగా ఉంది. రైల్వేశాఖ తన పనులనుపూర్తి చేయగా ఆర్అండ్‌బి అధికారులు చేయాల్సిన పనులు చేయకపోవడం వల్ల ఈ ఆర్‌వోబి ప్రజలకు అందుబాటులో రావడం లేదు. అంతేగాక ఈ బ్రిడ్జి నిర్మాణం వల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. మొత్తం రూ.280 కోట్ల అంచనాలకు గాను రూ.105 కోట్ల మేరకు పనులు జరిగాయి. 2018లో పనులు ప్రారంభం కాగా గత ఐదేళ్ల కాలంలో వైసిపి ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో ఈ బ్రిడ్జి నిర్మాణం గతేడాది మేలో అర్ధాంతరంగా ఆగిపోయింది. కాంట్రాక్టరుకు ఇంకా రూ.5.23 కోట్ల బకాయిలున్నాయి. దీంతో ప్రస్తుత ప్రభుత్వం తక్షణం నిధులు విడుదల చేస్తేనే ఈ పనులు తిరిగి ప్రారంభం అవుతాయని అధికారులు తెలిపారు.

అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం సక్రమంగా అందించాలి

గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు అంగన్వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం సక్రమంగా అందించటంతో పాటు వారి ఆరోగ్యాన్ని ఆశా, ఎఎన్ఎం, మహిళా పోలీసులు సమన్వయం చేసుకుంటూ నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ స్త్రీ,శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల గ్రోత్ లెవల్స్, గర్భిణీలు, బాలింతల ఆరోగ్య పరిస్థితి, పౌష్టిక ఆహారం, బాలామృతం, వాటి సరఫరా, అమలు చేస్తున్న కార్యక్రమాలు, మౌలికసౌకర్యాలు, గృహహింస, లైంగిక వేధింపులు, బాధితులకు పరిహారం, మిషన్ వాత్సల్య కార్యకలాపాలు, పునరావాస కేంద్రాలు తదితర అంశాలపై జిల్లా స్త్రీ,శిశు సంక్షేమశాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎత్తుకు తగిన బరువు, నిర్దేశించిన ఎదుగుదల లేని చిన్నారులపై అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రతిరోజు వారు పౌష్టికారం తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు సరుకులు నిర్దేశిత సమయానికి పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవటంతో పాటు. సరఫరా సమయంలోనే సరుకుల నాణ్యతను పరీక్షించి తీసుకునేలా క్షేత్ర స్థాయి సిబ్బంది సూపర్‌వైజర్ల ద్వారా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలన్నారు. గర్భిణీలు, బాలింతల ఆరోగ్యంపై వైద్యారోగ్యశాఖ అధికారులను సమన్వయం చేసుకుంటూ మెరుగైన వైద్యసలహాలు, సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాల్యవివాహాలు, చిన్నారులపై లైంగిక దాడులు నివారించేందుకు విస్తృత స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి యం.ఉమాదేవి, నోడల్ అధికారి శ్రీవాణి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్ విజయ కుమార్, సీడీపీఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

పాలిటెక్నిక్ విద్యార్థినులకు ఎఐసిటిఇ ఉపకార వేతనాలు

ప్రజాశక్తి-గుంటూరు

అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఎఐసిటిఇ) ప్రగతి ఉపకార వేతనాలకు గుంటూరు, గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ విద్యార్థినులు 6గురు ఎంపికయ్యారు. వారికి ప్రతి ఏటా రూ.50వేల చొప్పున మూడేళ్లపాటు ఉపకార వేతనాలు అందనున్నాయి. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకరరావు, అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన బాలికలు ఆర్థిక సమస్యల కారణంగా ఉన్నత విద్యాభ్యాస్యానికి దూరం కాకూడదనే లక్ష్యంతో ఎఐసిటిఇ ప్రగతి ఉపకార వేతనాలు అందిస్తుందన్నారు. ఈ క్రమంలో కళాశాలకు చెందిన 30 మంది బాలికలు దరఖాస్తు చేయగా, అర్హత కలిగిన 6గురు ఎంపికయ్యారన్నారు. కుంచాల వైష్ణవి, వాసిమల్ల బ్యూలా, కానోజియా దేవంతి, సిరిపురపు హర్షిత, క్రోసూరి రుషిత, సోమరౌతు లిఖితవేదసాయి మాన్విత ఎంపికైన వారిలో ఉన్నారన్నారు. ఈ ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. విద్యార్థులను అభినందించిన వారిలో ఇసిఇ శాఖాధిపతి బి.రమాసుందరి ఉన్నారు.



ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఇసిఇ హెచ్‌ఒడి



మిర్చి నిల్వలు

		బ్యాగులు
మిర్చి దిగుమతి	:	29,187
మిర్చి ఎగుమతి	:	26,159
మిర్చి నిల్వ	:	14,317

మిర్చి ధరలు

	రూపాయలలో
334	9,000 - 16,500
నెం.5	11,000 - 14,200
273	11,000 - 12,000
341	9,000 - 16,500
4884	12,000 - 12,000
సూపర్ 10	13,500 - 13,500
నాన్ ఎసి స్పెషల్ వెరైటీ	
తేజ	7,500 - 19,000
బడిగి	9,000 - 18,000
దేవనూరు డీలక్స్	10,000 - 13,500
తాలుకాయలు	5,000 - 13,000
ఎసి కామన్ వెరైటీ	
334	8,000 -13,500
నెం.5	9,000 - 10,000
273	13,000 - 13,000
341	8,500 - 16,500
4884	13,500 -16,000
ఎసి స్పెషల్ వెరైటీ	
తేజ	9,500 - 18,000
బడిగి	9,000 - 13,000
దేవనూరు డీలక్స్	9,000 - 18,000
తాలుకాయలు	5,000 - 12,000

చిప్స్ అధ్యాపకులకు ఐపిసిలో అవార్డులు ప్రదానం

ప్రజాశక్తి-గుంటూరు

హైదరాబాద్ హైటెక్స్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఇటీవల జరిగిన ప్రతిష్టాత్మక 73వ ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్‌లో చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కాలేజి అధ్యాపకులు సమర్పించిన పరిశోధనా పత్రాలకు వివిధ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విద్యాధర తెలియజేశారు. ఫార్మకాలజీ విభాగంలో ఆర్.సాయిరేష్మ 'ఎఫెక్ట్ ఆఫ్ ఐసోలేటెడ్ ఫైటో కెమికల్స్ ఫ్రం హార్థిక్య బిన్ నేత న్ ఎల్జిసియా అండ్ న్యూరో ప్రొడక్షన్ ఇన్ డెక్సా మెథజోన్ ఇన్డ్యూస్డ్ డయాబెటిక్ ర్యాట్స్' అనే సమర్పించిన పరిశోధనా పత్రానికి ప్రథమ బహుమతి దక్కిందన్నారు. అలాగే డాక్టర్ పి.విజేత సమర్పించిన జిసిఎంఎస్ అనాసిస్ అండ్ ఎవల్యూషన్ ఆఫ్ యాంటీ డిప్రెసెంట్ యాక్టివిటీ ఆఫ్ బయో కాన్‌స్టిట్యూషన్స్ ఐసోలేటెడ్ ఫ్రం సోలానం సురటెన్స్ ఇన్ సిలికో అండ్ ఇన్వైఓ' అనే పరిశోధనాపత్రానికి ద్వితీయ బహుమతి అందుకున్నారు. ఈ సదస్సులో 2500 మందికిపైగా పాల్గొన్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయా అధ్యాపకులకు కళాశాల యాజమాన్యం డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, సిఎన్.శ్రీనివాస్, గోపాలకృష్ణ అభినందనలు తెలిపారు.



అధ్యాపకులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

హెల్మెట్‌లేని ప్రయాణం ప్రమాదకరం

మోటారు వాహనా చట్టాలపై అవగాహన కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్

ప్రజాశక్తి-తెనాలి

వాహనదారులు హెల్మెట్ ధరించడం వలన తమ ప్రాణాలను కాపాడుకోవచ్చని, హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం శిక్షార్హమని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం శ్రీధర్ అన్నారు. తెనాలి మండల న్యాయసేవా అధికార సంస్థ అధ్వర్యంలో మంగళవారం జరిగిన వాహన చట్టాలపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. పోలీసులు, మోటారు వాహనాల అధికారులతో కలసి హెల్మెట్ వినియోగంపై ప్రయోజనాలను వివరించారు. ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న వాహనదారులు డ్రైవర్‌తో పాటు వెనుక కూర్చొన్న వ్యక్తి కూడా తప్పకుండా హెల్మెట్ ధరించాలని తెలిపారు. వాహనంపై ఇద్దరుకు మించి ప్రయాణం చేయరాదని తెలిపారు. బళ్లకు సైలెన్సర్ లేకపోయినా లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేసినా చట్టరీత్య నేరమన్నారు. జూనియర్ సివిల్ జడ్జి పవన్ కుమార్ మాట్లాడుతూ హెల్మెట్ ధారణపై పోలీసులు దృష్టి సారించి ప్రమాదాలను అరిట్టటమే లక్ష్యంగా పని చేయాలనన్నారు. ఎంవిఐ రాఘవరావు మాట్లాడుతూ తమ కార్యాలయంలో లైసెన్స్‌లకు వచ్చిన వాహనదారులకు హెల్మెట్ ధరించడం వలన ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తూన్నామని అన్నారు. హెల్మెట్ల వినియోగంపై డిసెంబరు 24వరకు విస్తృతంగా అన్ని శాఖల అధికారులతో అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించనున్నామని అన్నారు. తెనాలి రూరల్ ఎస్సై కోటేశ్వరరావు, వన్ టౌన్ సిఐ కరీముల్లా, భేతాళ ప్రభాకరరావు, పారాలీగల్ వాలంటీర్లు, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ పర్యవేక్షకులు మహబూబ్ పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయామూర్తులు



బిల్డర్ ఇంటిలో చోరీ

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలో రింగ్ రోడ్డు సమీపంలో గృహ నిర్మాణాలు చేపట్టే బిల్డర్ ఉప్పుతోళ్ళ శ్రీనివాసరావు ఇంట్లో సోమవారం అర్ధరాత్రి చోరి జరిగింది. అర్ధరాత్రి సమయంలో వెనుక ద్వారం గుండా ఇంట్లో ప్రవేశించిన గుర్తు తెలియని వ్యక్తులు గృహంలోని వారు నిద్రిస్తుండగా చప్పుడు కాకుండా బీరువాలోని బట్టలను, వస్తువులను చెల్లాచెదురు చేసి, బంగారు చైన్, రూ 90 వేల నగదును,రెండు సెల్‌ఫోన్లను అపహరించారు. ఈ మధ్యకాలంలో పట్టణంలో దొంగతనాలు జరుగుతుండటం పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజుల క్రితమే బాగా రద్దీగా ఉండే 15వ వార్డులో మహిళ మెడలో బంగారు గోలుసు లాక్కోని పోయారు. అంతకు ముందు పాత మాచర్లలోని బురుజు వద్ద ఓ ఇంట్లో చోరికి పాల్పడి సెల్‌ఫోను, బంగారు ఆభరణాలను దోచుకున్నారు. పట్టణంలో జరుగుతున్న దొంగతనాల పట్ల నిఘా పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

గడ్డి మందు తాగి మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి - నాదెండ్ల

కడుపునొప్పి తాళలేక మహిళ గడ్డి మందు తాగి మృతి చెందిన సంఘటన మండలంలోని ఎండుగుంబాలెం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. నాదెండ్ల ఎస్సై బలరామిరెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన గుడికందుల సాంబశివరావు భార్య విజయశాంతి(44) గత కొంత కాలంగా కడుపు నొప్పితో బాధ పడుతూ, ఎక్కడా చూపించినా తగ్గక పోవడంతో, కడుపు నొప్పి తాళలేక , ఆదివారం ఇంట్లో గడ్డి మందు తాగగా, ఇంట్లో వాళ్ళు చూసి, నరసరావుపేటలోని ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్చినారు. వైద్యశాలలో చికిత్స పొందుతూ మంగళవారం విజయశాంతి మృతి చెందింది. ఆమెకు ఒక కొడుకు, కూతురు ఉన్నారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



పోలీసులు పట్టుకున్న నిందితుడు, స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

50 మద్యం సీసాలు పట్టివేత

ప్రజాశక్తి - మంగళగిరి


మంగళగిరి పట్టణంలోని ఊర్వశి థియేటర్ సమీపంలోని నివాసంలో మంగళగిరి పట్టణ పోలీసులు అక్రమ మద్యం 50 క్వార్టర్ బాటిల్స్ ను మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు.నిందితుడు గండికోట మధును అరెస్టు చేశారు.మంగళగిరి పట్టణ సీఐ వినోద్ తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం

కాల్వలోకి దూసుకుపోయిన బస్సు
కాల్వలో నీళ్లు లేకపోవడంతో అంతా క్షేమం

ప్రజాశక్తి - దుగ్గిరాల

కాలువలో నీరు లేకపోవటం వలన పాఠశాల పిల్లలకు పెద్ద ప్రమాదం తప్పినది. తెనాలి మండల రూరల్ గ్రామం నంది వెలుగులోని విక్టోరియా కాన్వెంట్‌కు చెందిన మినీ వ్యాన్ ప్రతిరోజు దుగ్గిరాల వచ్చి పిల్లలను తీసుకువెళ్తుంది. ఇదే క్రమంలో మంగళవారం ఉదయం స్థానిక గణేష్ పురం వద్దకు వచ్చి నలుగురు పిల్లలను ఎక్కించుకొని మినీ వ్యాన్ రివర్స్ చేసుకునే క్రమంలో కొమ్మమూరు కాలువలోకి దూసుకుపోయి నిలిచినది. వ్యాన్ లోఉన్న పిల్లలకు డ్రైవం కు ఎటువంటి గాయాలు కాలేదు. దీనితో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



అంగన్వాడీల సమస్యలపై వినతి

ప్రజాశక్తి - నాదెండ్ల

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఐసిడిఎస్ అధికారులకు అంగన్వాడీలు విన్నవించారు. ఈ మేరకు అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీల అమలుకు పూనుకోవాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. ఐదేళ్లలోపు పిల్లలు ప్రైవేటు స్కూళ్లకు వెళ్లకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, అంగన్వాడీ ప్రీ స్కూళ్లను బలోపేతం చేయాలని కోరారు. కార్మికులు, ఉద్యోగుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, అంగన్వాడీ యూనియన్ అధ్యక్షులు సావిత్రి, నాగజ్యోతి పాల్గొన్నారు.



బీసీ హాస్టల్లో సదుపాయాల కల్పనకు ఎమ్మెల్యే అరవిందబాబు ఆదేశం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణంలోని బిసి బాలికల సంక్షేమ హాస్టల్‌ను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. హాస్టల్‌లోని ప్రతి గదిని పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు పడుతున్న ఇబ్బందులు చెప్పాలని, వాటికి పరిష్కరించే బాధ్యత తాను తీసుకుంటానని చెప్పారు. ఆహారం నాణ్యత సరిగా లేకపోవడం, డైనింగ్ హాల్లో సదుపాయాల లేమిని గమనించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డైనింగ్ హాల్లో టేబుల్స్, కుర్చీలు, వసతి గదుల్లో ఇతర సదుపాయాలు కల్పించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

చిత్రకారుడు జెస్టిస్‌కు గౌరవ డాక్టరేట్

ప్రజాశక్తి - వినుకొండ



పట్టణానికి చెందిన ప్రముఖ జాతీయ చిత్రకారుడు వజ్రగిరి జెస్టిస్ తన 40 ఏళ్ల చిత్రకళా ఆధ్యాత్మిక, సేవా రంగాల్లో సాధించిన 52 అవార్డులు, రివార్డులు, ఎన్నో చిత్రాలు, రికార్డులు సర్టిఫికెట్లను థీసిస్‌గా సమర్పించి లోగోస్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ నుండి గౌరవ డాక్టరేట్ పొందారు. యూనివర్సిటీకి చెందిన బిషప్ మోసెస్ గత ఆదివారం ఉదయం వినుకొండ వచ్చి జెస్టిస్ అవార్డులు, చిత్రాలు తదితర విశేషాలు పరిశీలించి ఎఫ్రాయిము చర్చిలో ఏర్పాటు చేసిన సభలో గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. జెస్టిస్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

ఉచిత ఇసుక విధానంతో నిర్మాణ రంగానికి పూర్వవైభవం



వినుకొండలో ఉచిత ఇసుక సరఫరాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి - వినుకొండ

ఉచిత ఇసుక విధానం వల్ల నిర్మాణ రంగానికి పూర్వ వైభవం రావడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని మార్కాపురం రోడ్డు భ్రమరా టౌన్షిప్ వద్ద నిల్వ ఉంచిన ఇసుక సరఫరాను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వంలో జగన్‌రెడ్డి ఇసుకను సామాన్య ప్రజలకు అందనివ్వకుండా దోపిడీ చేసి రూ.వేల కోట్లు దోచుకున్నారని విమర్శించారు. ఉచిత ఇసుక విధానంతో భవన నిర్మాణ రంగంపై ఆధారపడిన 40 లక్షల కుటుంబాలకు న్యాయం జరిగిందన్నారు. సహజ వనరుల్లో ఒకటైన ఇసుకను ఇష్టానుసారంగా దోచుకున్న జగన్ రెడ్డికి ప్రజలు సరైన బుద్ధి చెప్పారని అన్నారు. ఉచిత ఇసుక సరఫరాలో అక్రమాలు జరిగితే ఉపేక్షించేది లేదని చెప్పారు.

చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం

ఉచిత ఇసు విధానం తేవడంపై హర్షం వ్యక్తం చేస్తూ భవన నిర్మాణ కార్మికులు స్థానిక ఏనుగుపాలెం రోడ్డులో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు హాజరయ్యారు. గత ఐదేళ్లలో భవన నిర్మాణ కార్మికులు తీవ్ర అన్యాయానికి గురయ్యారని, వారి సంక్షేమ బోర్డు నిధులనూ గత ప్రభుత్వం పక్కదారి పట్టించిందని విమర్శించారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ ఎం.ఆంజనేయులు, ఎం.ఏడుకొండలు, కె.వెంకటేశ్వర్‌రెడ్డి, ఎం.రమేష్, కె.వెంకటరెడ్డి, కె.వెంకట నరసయ్య, ఆయుబ్ ఖాన్, పివి సురేష్‌బాబు, కార్మిక సంఘం నాయకులు ఎస్.సైదా పాల్గొన్నారు.

నిరంతరం విజిలెన్స్ పరిశీలన

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

ఆక్రమాలకు తావు లేకుండా ఇసుక అవసరం ఉన్న ప్రజలకు నాణ్యమైన ఇసుకను సరఫరా చేసే పాలసీని సిఎం చంద్రబాబు ప్రభుత్వం రూపొందించిందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన వెల్దుర్తిలోని తన నివాసంలో ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో తీవ్రంగా నష్టపోయిన లారీ యజమానులకు ప్రస్తుత విధానంతో ఎంతోమేలు జరుగుతుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఇసుక మాఫియా చేతుల్లో ఉందని, ఇసుక ద్వారా రూ.50 వేల కోట్లను వైసిపి నేతలు దోచుకున్నారని ఆరోపించారు. గృహ నిర్మాణ సంస్థ పేరుతో 9 లక్షల టన్నుల ఇసుకను మింగారని, దానితో 10 లక్షల పేదల ఇళ్లు పూర్తయ్యేవని అన్నారు. ప్రస్తుత ఇసుక పాలసీపై నిరంతరం విజిలెన్స్ పర్యవేక్షణ ఉంటుందన్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, జెసి, ఆర్‌డిఒలు ఇసుక సరఫరాలో ఆక్రమాలు జరగకుండా పర్యవేక్షణ చేస్తారని చెప్పారు. నిర్మాణ రంగానికి తాసా పాలసీ ఊరటన్నారు.

రూ.17 లక్షలకుపైగా విత్తనాలు, ఎరువుల విక్రయాల నిలిపివేత



రెంటచింతల

ప్రజాశక్తి - రెంటచింతల

మండల కేంద్రమైన రెంటచింతలలోని పలు విత్తనాలు, ఎరువుల దుకాణాలను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం మంగళవారం తనిఖీలు చేసింది. ఓ దుకాణంలో సరైన పత్రాలు లేకపోవడంతో రూ.15 లక్షల విలువైన విత్తనాలు, రూ.98 వేల విలువచేసే ఎరువులను విక్రయాలను నిలిపేశారు. డిడిఎ సిహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ కొనుగోలు చేసిన ప్రతిదానికీ తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని చెప్పారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్ఐ రామారావు ఏవో వరలక్ష్మి, స్థానిక వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దాచేపల్లి

మండలంలోని పలు ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు మంగళశారం తనిఖీలు చేపట్టారు. దాచేపల్లిలోని భవ్యా ట్రేడర్స్‌లో సరైన ధ్రువపత్రాల్లేని రూ.1,15,500 విలువ చేసే 154 ప్యాకెట్ల పత్తి, మిర్చి విత్తనాలను సీజ్ చేశారు. యోగానంద ట్రేడింగ్ కంపెనీ పురుగుమందుల దుకాణంలోనూ తనిఖీలు చేశారు. తనిఖీల్లో ఎడిఎ బి.వెంకటేశ్వరరావు (విజయవాడ), ఎస్సై డి.రవికుమార్ (విశాఖపట్నం), లైజనింగ్ అధికారి పి.ప్రవీణ్, పిడుగురాళ్ల సహాయ వ్యవసాయ సంచాలకులు బి.శ్రీకృష్ణదేవరాయలు, మండల వ్యవసాయ అధికారి డి.పాపకుమారి పాల్గొన్నారు.

దాచేపల్లి



కలెక్టర్‌కు యుటిఎఫ్ సత్కారం.. సమస్యలపై విన్నపం..

ప్రజాశక్తి -పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన పి.అరుణ్‌బాబును ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు, యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.ప్రేమ్‌కుమార్, జి.విజయసారధి, ఇతర నాయకులు పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట కలెక్టరేట్‌లో మంగళవారం కలిసి సత్కరించారు. జిల్లాలో విద్యారంగ పరిస్థితులను, పాఠశాలల స్థితిగతులను కెఎస్ లక్ష్మణరావు వివరించారు. సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరతను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. విద్యారంగంలో ఇన్‌ఛార్జుల పాలన నడుస్తోందని, 9 మండలాల్లో ఎంఇఒ-1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఎఫ్ఎసిల నియామకం వెంటనే చేపట్టాలని కోరారు. గతేడాది 10వ తరగతి మూల్యాంకన విధులు నిర్వహించిన వారికి వెంటనే డబ్బులు చెల్లించాలని, మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలోని ఎన్‌సిసి ఇన్‌స్ట్రక్టర్ విషయంలో అర్హతలున్న వారిని నియమించాలని కోరారు. సమస్యల పరిష్కారంపై డిఇఒ కార్యాలయంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ విద్యారంగం బలోపేతానికి తమ సహకారం ఉంటుందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేలా ఉపాధ్యాయులు పని చేయాలన్నారు.



జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబును సత్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రభుత్వ ఉద్యోగుల శుభాకాంక్షలు

ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రభుత్వ ఉద్యోగుల సహకారం తప్పనిసరిగా ఉంటుందని ఎన్‌జిఒ ఉద్యోగులు అన్నారు. మంగళవారం తాలూకా యూనిట్ నాయకులు కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అధ్యక్షులు ఎం.రామకృష్ణ, కార్యదర్శి ఎం.ఆనంద్‌నాథ్, ఉపాధ్యక్షులు డివిడి ప్రసాద్, రవికుమార్, నారాయణ, పివిఎస్ నాగేశ్వరరావు, రామానుజన్‌రెడ్డి, బ్రహ్మేశ్వరరావు, శ్రీనివాసరావు, మాణిక్యమ్మ, మహిళా అధ్యక్షులు అనురాధ, పద్మావతి పాల్గొన్నారు.



సమస్యలుంటే టోల్ ఫ్రీ, మెయిల్ ఐడికి ఫిర్యాదు చేయండి

తుళ్లూరు మండలంలో ఇసుక స్టాక్ పాయింట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలంకు సంబంధించిన లింగాయపాలెం, తాళ్లాయ పాలెం ఇసుక స్టాక్ పాయింట్లను గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, ఎస్పీ తుషార్ దూడి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా లింగాయపాలెం ఇసుక స్టాక్ పాయింట్ వద్ద కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో తాళ్లాయపాలెం, లింగాయపాలెం, గుండిమెడ, మున్నంగి, కొల్లిపర వద్ద ఇసుక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తాళ్లాయపాలెం, లింగాయపాలెం రీచ్ లలో 6లక్షలు, మిగిలిన వాటిలో 8.5 లక్షల టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయని కలెక్టర్ చెప్పారు. లింగాయపాలెం రీచ్ లో నాలుగు పొక్లెయినర్లతో వాహనాలలో ఇసుకను నింపుతారని చెప్పారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు 50కి పైగా వాహనాల్లో ఇసుకను నింపడం జరిగిందన్నారు. వినియోగదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఒక్క ఆధార్ కార్డు పై రోజుకు 20 టన్నుల ఇసుక మాత్రమే ఇవ్వడం జరుగుతుందని అన్నారు. టన్ను ఇసుక ధర రూ. 250 గా నిర్ణయించడం జరిగిందన్నారు. ఇసుక పొందే విషయంలో ఏమైనా సమస్యలుంటే ఫిర్యాదు చేయడానికి టోల్ ఫ్రీ నెంబర్, మెయిల్ ఐడి ఇవ్వడం జరిగిందన్నారు. ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్, లారీల డ్రైవర్ల సమస్యలు, రవాణా ఎలా జరుగుతుంది అనే విషయాలు అడిగి తెలుసు కున్నారు. వాహనాలలో ఇసుక లోడింగ్ త్వరగా చేసేందుకు మరిన్ని యంత్రాలు ఏర్పాటు చేసేలా చూస్తామని చెప్పారు. రీచ్ నుండి ఇసుక రవాణా చేసే వాహనాల వల్ల ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చూడాలని పోలీసులకు సూచించామన్నారు. ఇసుక రవాణా చేసే వాహనాలు సరైన కండిషన్ లో వున్నాయా, లేదా.. తెలుసుకోవడానికి రవాణా శాఖ అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీకర్, మైనింగ్, రెవెన్యూ తదితర అధికారులు పాల్గొన్నారు.


లింగాయపాలెం ఇసుక స్టాక్ పాయింట్లు పరిశీలించిన కలెక్టర్ నాగలక్ష్మి,ఎస్పి తుషార్ దూడీ

బారులు తీరిన వాహనాలు

లింగా యపాలెం, తాళ్లా యపాలెం ఇసుక రీచ్‌ల లో ఇసుక స్టాక్ పాయింట్లు ఏర్పాట య్యాయి. దీంతో ఇసుక స్టాక్ లకు దగ్గర లోని కృష్ణానది కరకట్ట పై కిలోమీటర్ మేర లారీలు, ట్రాక్టర్లు నిలిచిపో యాయి. ఒక వ్యక్తికి తన ఆధార్ కార్డుపై 20 టన్నుల ఇసుకను పొందే వీలు ఉంది. ఒక రోజులో మాత్రమే ఆధార్ కార్డు పై 20 టన్నుల ఇసుకను పొందే అవకాశం ఉంది. రెండవ రోజు ఆధార్ కార్డు పై ఇసుకను పొందే వీలు లేదు. దీనిపై కొంతమంది అధి కారులతో వాగ్వాదానికి దిగారు. ఒక్క రోజులో ట్రాక్టర్ లో 20 టన్నులు తరలించడం సాధ్యం కాదని, భారీగా వాహ నాలు రోడ్డుపై ఉంటే ట్రాక్టర్‌లు ఒక్కరోజులో నాలుగుసార్లు స్టాక్ పాయింట్ వద్దకు వచ్చి 5 టన్నుల చొప్పున ఇసుకను తీసుకు వెళ్లడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. నిబంధనల ప్రకారం ఆధార్ కార్డుపై రోజుకు 20 టన్నులు మాత్రమే ఇవ్వాలని అధికారులు బదులు చెప్పారు.

ఇసుక కూలీలకు ఉపాధి కల్పించాలని వినతి

ఇసుక కూలీలకు ఉపాధి కల్పించాలని లింగాయ పాలెంకు చెందిన కార్మికులు కలెక్టర్ ఎస్ నాగలక్ష్మిని కోరారు. మంగళవారం కలెక్టర్, ఎస్పి తుషార్ దూడి లింగాయపాలెం ఇసుక స్టాక్ పాయింట్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మాదల మహేంద్ర మాట్లాడుతూ, గతంలో ఇసుక రీచ్ లో వాహనాలలో ఇసుక లోడింగ్ చేయడం ద్వారా స్థానికంగా ఉన్న కార్మికులు ఉపాధి పొందే వారని కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. అమరావతి రాజధాని నిర్మాణానికి భూములు ఇవ్వడంతో కూలీలకు వ్యవసాయ పనులు లేక ఉపాధి లేకుండా పోయిం దన్నారు. 140 కుటుంబాలకు చెందిన కార్మికులు ఇసుక రీచ్ లో పనిచేసి ఉపాధి పొందేవారన్నారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ,2, 3 నెలల్లో స్టాక్ పాయింట్‌లో ఉన్న ఇసుక తరలింపు ప్రక్రియ పూర్తవుతుందని, తరువాత రీచ్ ల వద్ద కార్మికులకు పని కల్పించడం జరుగుతుందని చెప్పారు.


కార్మికులకు ఉపాధి కల్పించాలని కలెక్టర్‌కు విన్నవిస్తున్న మాదల మహేంద్ర


ముసన్నంగి స్టాక్ పాయింట్ వద్ద మాట్లాడుతున్న ఆలపాటి


కరకట్టపై పెద్ద సంఖ్యలో నిలిచిపోయిన వాహనాలు


ట్రాక్టర్లకు ఇసుకను నింపుతున్న జెసిబిలు

వినియోగదారుల్లో ఆనందం : ఆలపాటి

ప్రజాశక్తి - కొల్లిపర : నవరత్నాల పేరుతో ప్రజల నవనాడులను కంగ తీసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి చెందిందని మాజీ మంత్రి టిడిపి నాయకులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని కొల్లిపర, మున్నంగి ఇసుక స్టాప్ పాయింట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వము ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయడం నిరుపేద గృహ నిర్మాణదారులు, లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికుల్లో ఆనందాన్ని నింపిందన్నారు. వైసిపి నేతలు గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను భే ఖాతరు చేసి ఇసుక దోపిడి చేయడమే కాక లక్షలాది రూపాయలు సంపాదిం చారన్నారు. వైసిపి నేతలు అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక గుట్టలను నామ మాత్రపు చెల్లింపులతో లబ్ధిదారులకు మేలు చేసిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకే చెందిందన్నారు. మండలంలో జరుగుతున్న ఇసుక విక్రయాలను తెనాలి డిఎస్పి రమేష్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలను వరుస క్రమంలో ఉంచాలని ట్రాఫక్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బంది సూచించారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాయింట్ వద్ద తీసుకుం టున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో విష్ణు ప్రసాద్ ఏపీఎం ఇందిరా ప్రియదర్శిని ఎస్సై ఆర్ రవీంద్రారెడ్డి టిడిపి నాయకులు పాల్గొన్నారు.

టన్ను ఇసుక రూ.250

ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన ప్రభుత్వ అధికారులు

ఉదయం 6 నుండి సాయంత్రం 6 వరకు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

నూతనంగా ఏర్పడిన తెలుగుదేశం ప్రభుత్వం ఉచిత ఇసుక విధానంపై తీసుకున్న నిర్ణయం తో, ఇసుక వినియోగదారులు సోమవారం నుండి ఎంటీఎంసీ పరిధిలోని గుండె మెడ ఇసుక క్వారీ స్టాక్ పాయింట్ వద్ద బారులు తీరారు. మంగళవారం ఉదయం నుండి ఇసుకను లోడ్ చేసుకొని వెళ్లేందుకు గంటల తరబడి క్యూ లైన్ లో నిలబడ్డారు. గత వైసిపి ప్రభుత్వం తీసుకున్న ఇసుక పాలసీతో ఇబ్బందులు పడి, విసుగు చెందిన వినియోగదారులు ప్రస్తుతం ఇసుక అందుబాటులోకి రావడంతో నిర్మాణాలు చేపట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. గత ప్రభుత్వ హయాములో టన్ను ఇసుక ధర రూ.475 ప్రభుత్వం నిర్ణయించడం జరిగింది. వైసిపి ప్రభుత్వం హయాంలో నిర్మాణాలు కూడా మందకొడిగా సాగాయి. తెలుగుదేశం ప్రభుత్వం ఇటీవల అధికారంలోకి రాకముందు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉచిత ఇసుక విధానం తీసుకొస్తానని ఓటర్లకు హామీ ఇచ్చి, ఉచిత ఇసుక విధానం అమలు చేసేందుకు పూనుకుంది. ప్రస్తుతం ఇసుక టన్ను ధర 250గా నిర్ణయించి, స్టాక్ పాయింట్ల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేసింది. గుండి మెడలో సోమవారం నుండి ఉచిత ఇసుక విధానం అమలు చేస్తున్నట్లు ప్రకటించడంతో, వందల సంఖ్యలో ట్రాక్టర్లు, ట్రిప్పర్లు కష్ణ కరకట్టపై బారులు తీరాయి. అయితే మంగళవారం నుండి స్టాక్ పాయింట్ వద్ద ఇసుకను వినియోగదారులకు అధికారులు అందుబాటులో ఉంచారు. స్టాక్ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన ఇసుక ను క్రేన్ సహాయంతో వాహనాలలో ఇసుకను నింపుతున్నారు. ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఇసుకను విక్రయించేందుకు నిబంధనలు పెట్టినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ముందుగా వినియోగదారులు తమకు కావలసిన ఇసుకను ట్రిప్పర్, ట్రాక్టర్లలో లోడ్ చేసుకునేందుకు అధికారుల వద్ద ఇసుక బుక్ చేసుకునేందుకు గంటల తరబడి క్యూ లైన్ లో నిలబడాల్సిన పరిస్థితి దాపురించిందని పలువురు వినియోగదారులు వాపోతున్నారు.


ఇసుక కై బారులు తీరిన ట్రాక్టర్, ట్రిప్పర్ డ్రైవర్లు

జగన్‌ను కలిసిన ఎస్‌సి సెల్ అధ్యక్షులు

ప్రజాశక్తి-తాడేపల్లి : మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లి ఎస్‌సి సెల్ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్ తాడేపల్లిలోని ఆయన నివాసంలో మంగళవారం కలిశారు. తాడేపల్లిలో పార్టీ కోసం చేసిన సేవలను ఈ సందర్భంగా వివరించారు. మరింత ఉత్సాహంగా పని చేయాలని జగన్ చెప్పారని తెలిపారు.



సిఎం, డిప్యూటీ సిఎం చిత్రపటాలకు పాలాభిషేకం

ప్రజాశక్తి-తాడేపల్లి : ఉచిత ఇసుక విధానం అమల్లోకి వచ్చిన సందర్భంగా సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు కూటమి నాయకులు మంగళవారం ఉండవల్లి సెంటర్‌లో పాలాభిషేకం నిర్వహిం చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లడుతూ ఇసుక అందుబాటులోకి తేవడంతో నిర్మాణ రంగం ఊపందుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, జనసేన అధ్యక్షులు తిరుపతిరావు, ఈశ్వరనాయుడు, ఒ.రాము, దారా దాసు, పాల్గొన్నారు.




మున్నంగి ఆరోగ్య కేంద్రంలో ఎఎన్‌ఎంలతో మాట్లాడుతున్న వై నేతాజీ

నేడు ఆలిండియా డిమాండ్స్‌డే

నిరసన ప్రదర్శనలు, ధర్నాలను జయప్రదం చేయాలని పిలుపు

ప్రజాశక్తి - కొల్లిపర

కేంద్ర ప్రభుత్వము ప్రవేశపెట్టిన లేబర్ 4 కోడ్లను తక్షణ రద్దు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ డిమాండ్ చేశారు. మంగళవారం కొల్లిపర పంచాయతీ కార్మికులతో మున్నంగి మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలతో సమావేశంలో ఆయన ప్రసంగించారు. బుధవారం ఆలిండియా డిమాండ్స్‌డే ని అన్ని రంగాల కార్మికులు పెద్ద ఎత్తున నిర్వహించాలన్నారు. కొల్లిపర తహశీల్దార్ కార్యాల యం వద్ద తలపెట్టిన ధర్నాను విజయ వంతం చేయాలన్నారు. తెనాలి సిఐటియు కార్యదర్శి ములకా శివసాంబిరెడ్డి రెడ్డి మాట్లాడుతూ స్కీం వర్కర్లకు కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించటమే కాక కనీస వేతనాలు రూ.26000 చేయాలని డిమాండ్ చేశారు, నేడు జరిగే ధర్నాలో పంచాయతీ కార్మికులు, ఏఎన్ఎంలు, కాంట్రాక్టు ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు కార్యక్రమంలో సిఐటియు నాయకులు కోటా చంద్రశేఖర్ చింతల ప్రభాకర్ ఎం సాంబశివరావు పంచాయతీ వర్కర్లు పాల్గొన్నారు.


మంగళగిరిలో ర్యాలీ జయప్రదం చేయాలని ప్రచారంలో నాయకులు

ప్రజాశక్తి - మంగళగిరి

సిఐటియు ఆల్ ఇండియా కమిటీ పిలుపుమేరకు కేంద్ర ప్రభుత్వం అనుసరించే కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బుధవారం జరుగుతున్న నిరసనలను జయప్రదం చేయాలని మంగళవారం నాయకులు పిలుపిచ్చారు. మంగళగిరిలో నిరసన ర్యాలీ జరుగుతుందని సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం బాలాజీ, అధ్యక్షులు వై కమలాకర్ తెలిపారు. ర్యాలీ జయప్రదం చేయాలని మంగళవారం ఆటో స్టాండ్ లో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టాటామాజిక్ స్టాండ్ కొండలు, యర్రబాలెం ఆటోస్టాండ్ అన్వయ, నాగలింగం, సుభాని, కేశవులు, పెనుమాక ఆటో స్టాండ్ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.


తనిఖీలు నిర్వహిస్తున్న ఇంటర్నల్ డిస్ట్రిక్ట్ స్క్వాడ్ అధికారులు

ధ్రువ పత్రాలు లేనందున ఎరువుల విక్రయాలు నిలిపివేత

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : తెనాలి పట్టణంలో విత్తనాలు ఎరువులు పురుగు మందుల షాపుల్లో మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఇంటర్నల్ డిస్ట్రిక్ట్ స్క్వాడ్ ఎడిఎ కె నాగేశ్వర రావు, విజిలెన్స్ సిఐ సి మాణిక్యరావు, తెనాలి సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్ ఉషారాణి, గుంటూరు టెక్నికల్ ఎఒ బి గౌతమ్ ప్రసన్న, తెనాలి మండల వ్యవసాయ అధికారి ప్రేమ సాగర్ మారిస్ పేటలో ఎరువుల దుకాణాలను తనిఖీ చెశారు. స్థానిక మారిస్ పేట మణికంఠ ఎంటర్ప్రైజెస్ దుకాణంలో రికార్డులను నిశితంగా పరిశీలించారు. 219.30 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వలకు సంబంధించిన ధ్రువ పత్రాలు లేనందున రూ 39,07,022 లక్షల విలువైన ఎరువుల విక్రయాలను నిలిపివేసినట్లు మండల వ్యవసాయ అధికారి జి ప్రేమ సాగర్ తెలిపారు.



ఎంపికైన విద్యార్థులతో ఎన్‌సిసి అధికారులు, హెచ్‌ఎం

త్యాళ్లూరులో జెడ్‌పి పాఠశాలలో ఎన్‌సిసి ఎంపికలు

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని 75 త్యాళ్లూరు జెడ్‌పి పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికిగా విద్యార్థులకు ఎన్‌సిసి జెడబ్ల్యూ అండ్ జేడీ ఎంపికలు మంగళవారం జరిగాయి. పాఠశాల ఆవరణలో గుంటూరు 25(ఎ) బెటాలియన్ ఎన్‌సిసి యూనిట్ చేపట్టిన ఎంపికల్లో 60 మంది విద్యార్థులు పాల్గొనగా 31 మంది ఎంపికైనట్లు పాఠశాల ఎన్‌సిసి ఆఫీసర్ షేక్ నాగులుమీరా తెలిపారు. ఎంపికలను హవాల్దార్‌లు బి.శ్రీనివాసులు, సిహెచ్.చిరంజీవి, నాయక్, సుబేదార్ జితేందర్‌సింగ్ పర్యవేక్షించారు. యువతను క్రమశిక్షణ, దేశభక్తి గల పౌరులుగా తీర్చిదిద్దడంలో ఎన్‌సిసి ప్రముఖ పాత్ర పోషిస్తుందని, విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని హెచ్‌ఎం డాక్టర్ ఎ.శ్రీనివాసరెడ్డి అన్నారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - పెదకూరపాడు

మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద గర్భిణులకు పౌష్టికాహారాన్ని సమకూర్చారు. మండలంలోని తాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పెదకూరపాడులోని 30 పడకల ఆసుపత్రిలో మంగళవారం అందజేశారు. మండలంలోని హుస్సేనగరానికి చెందిన మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతినెల గర్భిణులకు పౌష్టికాహార పంపిణీని చేపట్టారు. కార్యక్రమంలోడాక్టర్ చైతన్య, డాక్టర్ ఆదిత్య, సిబ్బంది అప్పారావు, కె.కిరణ్, కె.ప్రసాద్, సినిమా హాల్ జానీ, మీరావలి పాల్గొన్నారు.



ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని బోయపాలెం అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా టిడిపి మండల అధ్యక్షులు కె.సాయిబాబు, గ్రామ అధ్యక్షులు రాజా అహ్మద్, ఉపాధ్యక్షులు బి.నరసయ్య పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

తమ అమ్మ పేరు మీద ప్రతిఒక్కరూ ఒక మొక్కను నాటి దాన్ని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని స్థానిక నారాయణ పాఠశాల హెచ్‌ఎం కె.శేషగిరి కోరారు. పాఠశాల పక్కన మండళవారం విద్యార్థులతో మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా పిల్లల్లో స్నేహభావం, వాతావరణం పట్ల మక్కువ పెరుగాయని చెప్పారు. పాఠశాలల వద్ద, మైదానాల్లోనూ మొక్కలు నాటించి పెంచుతామని, ఆహ్లాదకర వాతావరణాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు.

ఇంటి ఖర్చులకూ అర్చకుల అవస్థలు

నెలల తరబడి జీతాలు అందక, భక్తుల దక్షిణా దక్కక ఇబ్బందులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

శుభం కలగాలని, అస్టైశర్యాలూ దక్కాలని భక్తులకు దీవెనలు అందించే అర్చకులకు మాత్రం ఆర్థిక కష్టాలు తప్పడం లేదు. ఉదయం నాలుగు గంటల నుండి రాత్రి 10 గంటల వరకూ పూజాది కార్యక్రమాలతోపాటు దేవాదాయ శాఖకు సంబంధించిన ఇతర పనులనూ చేస్తున్న వారికి నెలల తరబడి జీతాలు పెండింగ్‌లో పెడుతున్నారు. దీంతో తాము ఇంటి ఖర్చులకూ డబ్బుల్లేక ఇబ్బందులు పడుతున్నామని అర్చకులు వాపోతున్నారు.

చిలకలూరిపేట పట్టణంలోని వివిధ దేవాలయాల్లో 50 మంది వరకు, మండలంలోని అన్ని గ్రామాలను కలిపి 150 మంది వరకూ అర్చకులుంటారు. నియోజకవర్గం మొత్తంలో వీరి సంఖ్య 500 వరకు ఉంటుంది. కేవలం అర్చకత్వం మీద ఆధారపడే వీరు, వీరి కుటుంబాలు జీవిస్తుంటాయి. వీరు దేవాలయాల్లో అర్చకత్వంతోపాటు దేవాదాయ భూముల కౌలు, ఇతర దేవాలయాలకు సంబంధించిన డబ్బుల వసూలు పనులూ చేస్తున్నారు. గతంలో దేవాలయాల్లో ప్రసాదం తయారీ, ఆవరణ శుభ్రం చేయడానికి ఒకరిద్దరు ఉండేవారు. అయితే వారికి డబ్బులు సరిగా ఇవ్వకపోవడంతో వారు కూడా పనులు మానుకుని, ఇతర పనులు చేసుకుంటున్నారు. దీంతో ఆ పనులనూ అర్చకులే చేసుకోవాల్సి వస్తోంది. అత్యవసర పని ఉన్నా, ఆరోగ్యం బాగోలేకున్నా తాము మాత్రం దేవాలయానికి వెళ్లి అర్చకత్వం చేయక తప్పడం లేదని వారంటున్నారు.

ఇంత చేస్తున్న తమకు జీతాల రూపంలో రూ.ఏడెనిమిది వేలకు మించి ఇవ్వడం లేదని, అదికూడా కొంతమందికి ఎనిమిది నెలలు, మరికొంతమందికి 10 నెలలుగా పెండింగ్ పెట్టారని వాపోతున్నారు. ప్రస్తుతం పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, అద్దెలు తదితర ఖర్చులతో కుటుంబాలు గడవడం కష్టమైపోతోందని



ఆవేదనకు గురవుతున్నారు. పూజ సందర్భంలో వచ్చే కొద్దిపాటి దక్షిణను ప్రైవేటు ఉద్యోగులు తీసుకుంటున్నారని, కొన్ని గుళ్లకు ధూప, దీప, నైవేద్యాల కోసం ప్రభుత్వ వారు ఇస్తున్న రూ.5 వేలను కూడా ఉద్యోగులే తీసుకుంటున్నారని అంటున్నారు. తమ ఇబ్బందులను దేవాదాయ శాఖ గమనించాలని, పెండింగ్ జీతాలను విడుదల చేయడంతోపాటు కనీస వేతనాలూ అమలు చేయాలని కోరుతున్నారు.

పరిశుభ్రతతోనే వ్యాధుల నియంత్రణ

ప్రజాశక్తి - వినుకొండ

డయేరియా నివారణపై మండలంలోని శివాపురంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమానికి సర్పంచ్ కె.సుబ్బమ్మ అధ్యక్షత వహించగా మండల రిసోర్స్ కో-ఆర్డినేటర్ ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, అప్పుడే వ్యాధులను అరికట్టగలమని అన్నారు. నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. దోమలు వృద్ధి చెందితే వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, దోమతెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఐటిసి ప్రతినిధులు ప్రదీప్, పద్మావతి, హెచ్‌ఎం రక్షణ, భార్గవి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

చీకటీగలపాలెంలో స్వచ్ఛపల్లె

మండలంలోని చీగటీగలపాలెంలో మంగళవారం స్వచ్ఛపల్లె కార్యక్రమాన్ని నిర్వహించారు. వికేంద్రీకృత గ్రామీణ ఘన వ్యర్థాల నిర్వహణపై రిసోర్సు పర్సన్లు వివరించారు. ఈ అంశంలో సత్తెనపల్లె మండలం నందిగామ మాజీ సర్పంచ్ బొల్లయ్య తమ గ్రామాన్ని



వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

తీర్చిదిద్దిన విధానాన్ని వివరించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం ద్వారా రూ.2 లక్షల రివార్డునూ ఆయన పొందారని, ఐటిసి రాష్ట్ర రిసోర్స్ పర్సన్‌గానూ వ్యవహరిస్తున్నారని తెలిపారు. చెత్తను సంపదగా మలచొచ్చని చెప్పారు. వ్యర్థాలను ఎక్కడంటే అక్కడ పడేయకుండా పారిశుధ్య సిబ్బందికే అందించాలని, పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతా పాటించాలని, దీన్ని అందరూ బాధ్యతగా చేస్తే వ్యాధులు ప్రబలే అవకాశం ఉండదని అన్నారు. కార్యక్రమంలో ప్రదీప్, ఏసోబు, ప్రభాకర్, ఎఎన్‌ఎం విజయలక్ష్మి, కరీమూన్, హుస్సేన్ బి, సాయిబాబా పాల్గొన్నారు.



చేపలు అమ్ముకోవద్దని ఆటంకాలు

ప్రజాశక్తి - వినుకొండ

గుండ్లకమ్మ నది, చెరువులో చేపలు పట్టుకొని వినుకొండలో అమ్ముకోటానికి వస్తున్న తమకు కొంతమంది వ్యాపారులు తీవ్ర ఆటంకాలు కలిగిస్తున్నారని అధికారులకు మత్స్యకారులు మంగళవారం ఫిర్యాదు చేశారు. తాము వినుకొండలో చేపలు అమ్మటానికి వీల్లేదంటూ వ్యాపారులు అంక్షలు పెట్టడంతోపాటు అడ్డుకుంటున్నారని వాపోతూ సిపిఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. పేదలమైన తమకు రక్షణ కల్పించాలని, కొంత భూమిని మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో పి.వెంకటేశ్వర్లు, మల్లికార్జున, ఆంజనేయులు, అంకాలు, రత్తమ్మ, సుబ్బులు, రామయ్య, ఏడుకొండలు, గాలయ్య, శేషగిరి పాల్గొన్నారు.

వైసిపి నేతల భూ అక్రమాలపై సిట్ వేయాలి : పుల్లారావు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

వైసిపి నేతల భూ అక్రమాలపై రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) వేయాలని ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు అన్నారు. పట్టణంలోని తన నివాసంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ చిత్తూరు నుంచి ఉత్తరాంధ్ర వరకు వైసిపి గద్దలు చెరబట్టిన భూముల్ని విడిపించాలన్నా, బాధితులకు సత్వర న్యాయం జరగాలన్నా సిట్ మేలన్నారు. మాజీ సిఎం జగన్‌రెడ్డి నుంచి, విజయసాయిరెడ్డి, పెద్దిరెడ్డి, వైవి సుబ్బారెడ్డి తోపాటు నాటి సిఎస్ జవహర్‌రెడ్డిపైనా తీవ్ర ఆరోపణల నేపథ్యంలో సిట్‌కు అప్పగించడమే ఉత్తమమన్నారు. వైసిపి పాలనలో విశాఖ, ఉత్తరాంధ్రలో 40 వేల ఎకరాలు పైగా భూఆక్రమణలు జరిగినట్లు ఫిర్యాదులు ఉన్నాయని, నాటి ప్రభుత్వంలో సీఎంవో నుంచి గల్లీస్థాయి నాయకులకు వరక అంతా కుమ్మక్కై భూస్వాహ పర్వాన్ని నడిపించారని అన్నారు. అసైన్డ్‌భూములపై శాశ్వత హక్కుల పేరుతో పేదల పొలాలనూ లాక్కున్నారని దుయ్యబట్టారు. త్వరలో విడుదల చేయనున్న శ్వేతపత్రంలో భూదోపిడీ మొత్తాన్ని ప్రజల ముందుకు తెస్తామని, భూముల రీసర్వే చట్టంలో లొసుగులతో ఎన్నిభూములు కొట్టేశారో నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉందని అన్నారు. జగనన్న కాలనీల పేరిట పేదల ఇళ్లస్థలాల పథకంలోనూ భారీగా దోచేశారని, భూములు చేతులు మారాయని, రెవెన్యూ రికార్డులను తారుమారు చేశారని ఆరోపించారు. భూ అక్రమాలపై కఠినచర్యలతో పాటు ఆస్తులు మొత్తం రికవరీ చేయాల్సిన అవసరం ఉందన్నారు.

హెల్మెట్లు పెట్టకే ప్రాణాపాయం

ప్రజాశక్తి -సత్తెనపల్లి రూరల్

ద్విచక్ర వాహన దారులు విధిగా హెల్మెట్ ధరించాలని పిడుగురాళ్ల బ్రేక్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ రాంబాబు అన్నారు. మండలంలోని ధూళిపాళ్లలో మోటారు వాహనాల చట్టంపై మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో తలకు ఎక్కువగా గాయం కావడం వల్ల చనిపోతున్నారని చెప్పారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యజమానులకు, తలిదండ్రులు కూడా శిక్షలు పడే విధంగా నూతన చట్టాలు ఉన్నాయన్నారు. వాహనదార్లంతా లైసెన్స్ పొందాలని, సకాలంలో వాహనానికి ఇన్స్యూరెన్స్ చెల్లించాలని సూచించారు.



మాట్లాడుతున్న బ్రేక్ ఇన్స్పెక్టర్ రాంబాబు

మండల న్యాయసేవాధికార సంస్థ, దాని ప్రయోజనాల గురించి న్యాయవాది డి.శ్రీనివాసరావు, పారాలీగల్ వాలంటీర్ కె.బాబురావు వివరించారు. హెడ్ కానిస్టేబుల్ వీరబాబు, కానిస్టేబుల్ బాజీ, సాంబిరెడ్డి, గ్రామస్తులు బి.తిరుపతిరావు, బి.ప్రసాదరావు, బి.వెంకటస్వామి, ఎన్.సూరిబాబు పాల్గొన్నారు.



గ్రావెల్ రోడ్డుకు ఎమ్మెల్యే శంకుస్థాపన

ప్రజాశక్తి-ఈపూరు

రైతు సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. రూ.8 లక్షలతో మండలంలోని వనికుంట గ్రామ సమీపంలో రైతులు పొలం వెళ్లే రోడ్డు రెండు కిలోమీటర్ల మేర గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో విరిగిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని, ప్రధాన రహదారిపై లోతైన గుంతలు ఏర్పడ్డాయని మరమ్మతులు చేయించాలని కోరారు. ఈ సమస్యలను సత్వరం పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ బచ్చనబోయిన వెంకటసుబ్బయ్య, పంచాయతీరాజ్ ఏఈ డి.వెంకట శ్రీలత, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఆర్.జగ్గారావు, మండల అధ్యక్షులు బాలయ్య, మాజీ ఎంపిపి బి.వెంకట కోటయ్య, ఎన్.కిషోర్, ఎ.కోటేశ్వర రావు, జి.శ్రీనివాసరావు, శ్రీనివాసరాజు, రామభద్రరాజు, వెంకట్రావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్‌తో కొత్త తరహా మోసం

తలలు పట్టుకుంటున్న వ్యాపారులు

ప్రజాశక్తి - మంగళగిరి

వ్యాపారస్తుల ఫోన్ పే క్యూఆర్ కోడ్ పై గుర్తు తెలియని వ్యక్తులు వారి ఫోన్ పే క్యూఆర్ కోడ్ స్టిక్కర్ అంటించి వ్యాపారస్తులను కొత్త తరహాలో చేస్తున్న మోసం వెలుగు చూసింది. మంగళగిరి పట్టణంలోని అన్నపూర్ణ డీలక్స్, పాత కూరగాయల మార్కెట్ వద్ద గత నాలుగు రోజులుగా ఇది జరుగుతుంది. ఇప్పటికే కొందరు వ్యాపారస్తులు రూ.లక్షలకు పైగా దోపిడీకి గురయ్యామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత నాలుగు రోజులుగా మంగళగిరి పట్టణంలోని అన్నపూర్ణ థియేటర్, పాత కూరగాయల మార్కెట్ సెంటర్లలో వ్యాపారస్తులు తమ కార్యకలాపాలు ముగించుకొని ఇంటికి వెళ్తున్నారు. ఆ తరువాత రాత్రి సమయాలలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు బయట గోడలకు, బోర్డులకు, వ్యాపారస్తులు అంటించిన ఫోన్ పే క్యూఆర్ కోడ్ స్కానర్లపై, గుర్తు తెలియని వ్యక్తులు వారి ఫోన్ పే క్యూఆర్ కోడ్ స్టిక్కర్లను అంటించి వెళ్ళిపోతున్నారు. ఉదయం యధావిధిగా షాపుకు వచ్చిన వ్యాపారస్తులు తమ వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఫోన్ పే చేసి కస్టమర్లు వెళ్లిపోతున్నారు. ఇది గమనించకపోవడంతో వ్యాపారస్తులు తమ ఖాతాలోకి డబ్బులు రావడం లేదని వాపోతున్నారు. తీరా ఎందుకు రావడం లేదని చూసుకోవడంతో



గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ పే క్యూఆర్ కోడ్ స్టిక్కర్లను వారి స్టిక్కర్లపై అంటిస్తున్నట్లు వారు గుర్తించారు. దీనిపై ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక అయోమయ పరిస్థితిలో వ్యాపారస్తులు తలలు పట్టుకుంటున్నారు. ఇదే కొనసాగితే మా పరిస్థితి ఏమిటి అని పలువురు వ్యాపారస్తులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని వ్యాపారస్తులు కోరుతున్నారు.

ముందు జాగ్రత్తలతో డయేరియా అరికట్టవచ్చు

అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మీర్ హుస్సేన్

ప్రజాశక్తి - పొన్నూరు

అతిసార వ్యాధి రాకుండా అవగాహనతో ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలని పొన్నూరు సాంబశివ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మీర్ హుస్సేన్ అన్నారు. ఆగస్టు 31వ తేదీ వరకు నిర్వహించే అతిసార మాసోత్సవాల కార్యక్రమాల సందర్భంగా మంగళవారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మీర్ హుస్సేన్ మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రంలోని విద్యార్థుల తల్లిదండ్రులకు అతిసార వ్యాధి రాకుండా జాగ్రత్తల గురించి ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. 0 నుండి 5 సంవత్సరాల పిల్లల తల్లిదండ్రులకు అతి సార వ్యాధి నివారణకు ఓఆర్ఎస్, జింకు టాబ్లెట్లు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఆహారం తీసుకునే ముందు, వాష్ రూమ్ కు వెళ్లి వచ్చిన తర్వాత ప్రతిసారి సబ్బుతో చేతులు శుభ్రపరుచుకోవాలని తెలిపారు. వర్షాకాలంలో వేడివేడి ఆహార పదార్థాలు భుజించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని పేర్కొన్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వారానికి ఒకసారి ఫ్రైడే ను డ్రై డేగా పాటించాలని తెలిపారు. రాత్రిపూట దోమతెరల్లో నిద్రించాలని తెలిపారు. వాటర్ ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి క్లోరినేషన్ చేసుకొని ప్రతిసారి వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. అనంతరం 'అతిసార వ్యాధి నుండి పిల్లలను రక్షించండి' అనే పోస్టర్లను డాక్టర్ మీర్ హుస్సేన్, సిబ్బంది ఆవిష్కరించారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బంది కనకదుర్గ , జ్యోతి, అనూష,లత,లీల ఏఎన్ఎంలు ,ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



'అతిసార వ్యాధి నుండి పిల్లలను రక్షించండి' పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యులు, సిబ్బంది

కెఎల్‌యులో ప్రారంభమైన అంతర్జాతీయ గణిత సదస్సు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో నాలుగవ అంతర్జాతీయ గణిత విభాగ సదస్సును బుధవారం ఘనంగా ప్రారంభించారు. సభలో ప్రముఖ ఎన్ ఐటి తిరుచు రాపల్లి నుండి డాక్టర్ వి.లక్ష్మణ గోమతి నయగమ్ గణితం యొక్క ఆవశ్యకతను ఇతర విభాగాలతో అనుసంధానమైన సమస్యల మీద ప్రసంగించారు. కేరళ విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ జి.సురేష్ సింగ్ రాబోయే రోజుల్లో గణిత శాస్త్రవేత్తలు అవసరం చాలా ఉందని నొక్కి చెప్పారు. కెఎల్ యు ప్రొఫెసర్ డాక్టర్ కెఎస్.జగన్నాథరావు మాట్లాడుతూ వైద్యులు వారి యొక్క వత్తిలో రోగులను పరీక్షించి వ్యాధిని నిర్ధారించుటలో గణితం యొక్క ఆవశ్యకతను వివరించారు. తమిళనాడులోని గాంధీగ్రామ్ రూరల్ ఇనిస్టిట్యూట్ నుండి హాజరైన డాక్టర్ జి.మహాదేవన్ మాట్లాడుతూ గ్రాఫ్ థీయరీ, మరియు మెడికల్, డిజిటల్ సంబంధించిన సమస్యల పరిష్కారానికి గణితం ప్రాముఖ్యతను గురించిన పరిశోధనా పత్రాన్ని ప్రదర్శించారు. తమిళనాడులోని అన్నామలై విశ్వవిద్యాలయంలోని ఆచార్యులు డాక్టర్ ఎం.శ్రీనివాసన్ మాట్లాడుతూ క్యూయింగ్ థియరీ ద్వారా అనేకమైన ప్రస్తుత సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయని తాను రూపొందించిన పరిశోధనా పత్రం ద్వారా తెలియపరిచారు. సదస్సులో దేశ వ్యాప్తంగా ఆయా విశ్వవిద్యాలయాల నుండి 200 మంది పరిశోధనా విద్యార్థులు తమ పరిశోధనలను సమర్పించారు. మరో నాలుగు రోజుల పాటు ఈ సదస్సు కొనసాగుతుందని గణిత విభాగాధిపతి మరియు ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ బివి.అప్పారావు తెలిపారు. కార్యక్రమంలో వర్శిటీ వైస్ ఛాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారథివర్మ, డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్ రామ్, డాక్టర్ కె.రాజశేఖర రావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎఫ్ఇడి డైరెక్టర్ డాక్టర్ ఎ.జగదీష్, ఎఫ్ఇడి ప్రిన్సిపల్ డాక్టర్ వి.కష్ణారెడ్డి, సైన్స్ కళాశాలల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం, సదస్సు కన్వీనర్ డాక్టర్ కె.రేణుక తదితరులు పాల్గొన్నారు.




జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున విసి తదితరులు

ఆదమరిచారో భూములు హాంఫట్

ప్రజాశక్తి-తాడేపల్లి

టిడిపి ప్రభుత్వం రావడంతో రాజధాని పనుల్లో కదలిక మొదలైంది. రాజధాని ముఖద్వారం ఉండవల్లి ఆనుకుని పక్కనే ఉన్న తాడేపల్లిలో భూబకాసురులు బయల్దేరారు. రాత్రికి రాత్రే రికార్డులు ఉన్నవి లేనట్లు లేనివి ఉన్నట్లు నమ్మబలికి భూమిని మాయం చేసేస్తున్నారు. ఇందులో కొందరి భూ బకాసురుల హస్తం ఉన్నట్లు వినవస్తుంది. రాజధాని ప్రాంతంతో పాటు తాడేపల్లిలో భూమి, ప్లాట్లు గల యజమానులు ప్రతిరోజూ తమ భూములు ఉన్నాయో లేదోనని చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పది రోజులు తమ భూమి వైపు యజమానులు వెళ్లకపోతే మాయ చేసి అమ్మేసే కేటుగాళ్లు తయార య్యారు. భూమికి సంబంధించి సరైన డాక్యు మెంట్లు లేకపోయినా కొద్దిపాటి లొసుగులు అడ్డం పెట్టుకుని గద్దల్లాగా వాలిపోయి కోట్ల రూపాయల భూమి కాజేయ డానికి సిద్ధంగా ఉన్నారు. అమాయకులు వీరి వలలో పడి మోసపోతున్నారు. రెండు రోజుల క్రితం తాడేపల్లి సాయిబాబా గుడి సమీపంలో సర్వే నెంబర్ 268ఎలో 3.07 ఎకరాలు, అదే సర్వే నెంబర్ బిలో 1.03 ఎకరాలు మొత్తం కలిపి 4.10 ఎకరాల భూమిలో జగదీష్‌బాబు వెంచర్ వేశారు. మొత్తం 28 మంది పేర్ల మీద ప్లాట్లు రిజిష్టర్ అయ్యాయి. విజయవాడ, గుంటూరు, తెనాలి, మంగళగిరి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో జనవరి ఆరో తేదీ 1980లో లేఅవుట్ వేసి ప్లాన్ వేసి అప్రూవల్ చేశారు. ఇందుకు సంబంధించి డెవలప్‌మెంట్ కోసం 20 సెంట్లు స్థలం పార్కు, గుడి, ఇతర అవసరాల కోసం వదిలారు. లేఅవుట్ ప్లాన్ నెంబర్ 46/80గా విజిటిఎం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మంగళగిరి డివిజన్ ఆఫీసులో నమోదు అయ్యి ఉంది. ఈ 20 సెంట్లు సెంటు రూ.20 లక్షలు చొప్పున రెండు కోట్ల రూపాయలకు పట్టణంలోని సీతానగరంకు చెందిన వారికి కొంత మంది బ్రోకర్లు అమ్మజూశారు. కొనుగోలుదారులు అనుమానం వచ్చి ఆరా తీయగా ఆ భూమి లేఅవుట్ కింద ప్లాన్ వేసి అప్రూవల్ అయ్యి ఉందని, తమకు అమ్మజూపిన 20 సెంట్లు ప్లాట్ల డెవలప్‌మెంట్ కోసం వదిలిన స్థలమని తెలుసుకుని అవాక్కయ్యారు. వాస్తవం తెలియక నాలుగు రోజుల క్రితం 20 లక్షల రూపాయలు అడ్వాన్సు ఇవ్వడానికి సిద్ధమయ్యారు. తమకు అసలు విషయం తెలియజేసి తమ సొమ్ము దుర్వినియోగం కాకుండా వాస్తవం చెప్పిన వారికి కొనుగోలుదారులు అభినందనలు తెలిపారు. తాడేపల్లి ప్రాంతంలో భూమి గల యజమానుదారులారా బహుపరాక్ జాగ్రత్త అంటున్నారు స్థానికులు.





స్థల ప్లాను, వివరాలు



'నో బ్లడ్' ఆసుపత్రి ప్రారంభం

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని డోలాస్‌నగర్‌లో మంగళవార నో బ్లడ్ ఆసుపత్రిని డాక్టర్ ప్రవీణ్‌రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి సర్జరీ లేకుండా రక్తం చిందకుండా సర్జరీ లేని వైద్యం అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. బిపి, షుగర్, థైరాయిడ్ లాంటి ఏ జబ్బు అయినా ఆరు నెలల్లో పరిష్కారం చేస్తామని వివరించారు. ఒక్క రోజులోనే రక్తపరీక్షలు సిటీ స్కాన్, గర్భిణీ స్కానింగ్, ఎక్స్‌రే నిర్వహించి అదేరోజు ఇంటికి పంపడం జరుగుతుందని చెప్పారు. అన్ని రకాల మందులపై 25 శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. కిడ్నీలకు సంబంధించి ప్రత్యేక చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. కిడ్నీలో రాళ్లు ఉన్న వారు మూడు రోజుల్లోనే మందుల ద్వారా తగ్గించడం జరుగుతుందని వివరించారు. లివర్, గుండెకు సంబంధించి వైద్య సదుపాయం అందుబాటులో ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫిజిషియన్ అసిస్టెంట్ డాక్టర్ ఆశారాణి, డైరెక్టర్ ఎస్‌కె ఫిరోజ్‌బాబు, ఆసుపత్రి చైర్మన్ పి.లారెన్స్ నితిన్ పాల్గొన్నారు.

పసుపు తూకంలో పొరపాటు

ప్రజాశక్తి - దుగ్గిరాల

స్థానిక వ్యవసాయ మార్కెటింగ్ యార్డ్లో సోమవారం జరిగిన పసుపు విక్రయాల అనంతరం వేసిన తూకంలో పొరపాటు జరిగినది. సోమవారం మొత్తం 1137 బస్తాలు అమ్మకాలు జరిగాయి. ఒకటో నెంబర్ షెడ్డులో దాదాపు 100 బస్తాలు తూకం వేయడం జరిగినది. ఈ షెడ్డులో తూకం వేసిన వేయింగ్ మిషన్ స్ప్రింగ్‌లో పసుపు కొమ్ము ఇరుక్కుపోవటం వలన ప్రతి బస్తాకు 7 కేజీలు పసుపు తక్కువ వచ్చినది. ఇది గ్రహించిన కొనుగోలుదారులు మంగళవారం యార్డుకు వచ్చి ఫిర్యాదు చేశారు. వేయింగ్ మిషన్ పరిశీలించి పొరపాటు జరిగినట్లు గ్రహించారు. ఇది తమదే పొరపాటున ఇకముందు ఇటువంటి తేడా లేకుండా చూసుకుంటామని హమాలీలు తెలిపారు. పసుపు అమ్మిన రైతులకు ఈ మేరకు సమాచారం అందించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి-తాడేపల్లి

ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఆయాలు, పారిశుధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని మంత్రి నారా లోకేష్‌ను విజయవాడకు చెందిన వారు కోరారు. మంగళవారం జరిగిన ప్రజాదర్బార్‌లో ఈ మేరకు మంత్రికి వినతిపత్రం అందజేశారు. తొమ్మిదేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్నామని, పాఠశాలల విలీనం వల్ల పని ఒత్తిడి పెరిగిందని తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన భార్య వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం చేయాలని మంగళగిరి ఉడా కాలనీకి చెందిన మౌలాలి కోరారు.

ఎసిసి సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులు బకాయిలు చెల్లించాలి

నూతన ఆర్థిక విధానాల ఫలితంగా మూతబడి, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న తాడేపల్లి ఎసిసి సిమెంటు ఫ్యాక్టరీ కార్మికుల జీతాల బకాయిలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కెసి వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులు మంత్రి లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. కోర్టు తీర్పులు కార్మికులకు అనుకూలంగా వచ్చినా కొన్ని లొసుగులను అడ్డం పెట్టుకుని యాజమాన్యం నాన్చుడి ధోరణి అవలంభిస్తుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికీ సుమారు 150 మంది కార్మికులు అర్ధాకలితో చనిపోయారని యూనియన్ నాయకులు వివరించారు. ఫ్యాక్టరీ మూత పడటంతో రావాల్సిన నష్టపరిహారం రాకపోవడంతో నైపుణ్యం లేని పనులకు వెళ్లి కార్మికులు చెట్టుకొకరు పుట్టకొకరు అయ్యారని తెలిపారు. న్యాయంగా తమకు రావాల్సిన బకాయిలను యాజమాన్యం చెల్లించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్పీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



పల్నాడు జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పి అరుణ్ బాబును కలెక్టరేట్ లో మంగళవారం పల్నాడు జిల్లా ఎస్పీ మలిక గర్గ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా సమగ్రాభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలు ఎన్నికల సమయంలో వాటిల్లిన వివాదాలపై ఎస్పీ జిల్లా కలెక్టర్ కు వివరించారు.



మాట్లాడుతున్న సబ్- లెఫ్టినెంట్ సాయిరామ్

ఆర్‌విఆర్‌లో రక్షణ శాఖలో ఉద్యోగావకాశాలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

భారత రక్షణ దళాలలోని ఉద్యోగ అవకాశాలను సద్వినియోగించుకొంటూ, దేశ సేవలో విద్యార్థులు భాగస్వాములవ్వాలని ఇండియన్ నావెల్ అకాడమీ (కేరళ) సబ్-లెఫ్టనెంట్ సాయిరామ్ సూచించారు. మంగళవారం ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కళాశాలలో 'స్టార్టప్ అండ్ కెరీర్ ఆపర్చునిటీస్ ఇన్ ఆర్మ్ ఫోర్సెస్' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిరామ్ మాట్లాడుతూ భారతరక్షణ దళాల్లో బి.టెక్ విద్యార్థులకు ఉన్న అవకాశాలను వివరిస్తూ, వాటిని అందిపుచ్చుకోవడానికి తగిన మార్గాలను ఆయన వివరించారు. విద్యాభ్యాసం సమయంలోనే విద్యార్థులు ఒక మంచి జీవిత లక్ష్యాన్ని ఎంచుకొని, దాని సాధనకు కషి పట్టుదలతో నిత్యం ప్రయత్నించాలని, భారత సైనిక త్రివిధ దళాలలోని సైనికులకు ఉద్యోగ భద్రతతో పాటుగా, కుటుంబ సభ్యులకు ప్రత్యేకమైన విద్యా, వైద్య సేవలు, వివిధ రకాల సౌకర్యాలు కేంద్ర ప్రభుత్వం నుండి లభిస్తాయని ఆయన తెలియజేశారు. విద్యార్థులు తమ నైపుణ్యాలను దేశ రక్షణకు ఉపయోగించి, ప్రపంచ దేశాలకు భారతదేశ సైనిక బలాన్ని చాటిచెప్పే విధంగా ఆలోచనలు చేయాలని కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు.ఇండియన్ నావెల్ అకాడమీ (కేరళ)సబ్- లెఫ్టనెంట్‌గా ఉన్నత పదవిలో దేశరక్షణ వ్యవస్థలో సేవలందిస్తున్న సాయిరామ్ తమ కళాశాల పూర్వవిద్యార్థి కావడం, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావడం తమకెంతో ఆనందంగా ఉందని కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ రాయపాటి గోపాలకష్ణ, ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ అతిథిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి. శ్రీనివాసరావు, కళాశాల కెరీర్ గైడెన్స్‌సెల్ కన్వీనర్ డాక్టర్ వి.తారాచంద్ పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు



ఆటో డ్రైవర్లకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

నేడు కలెక్టరేట్ వద్ద నిరసన విజయవంతం చేయండి

ప్రజాశక్తి-గుంటూరు

దేశవ్యాప్త పిలుపులో భాగంగా కార్మిక సమస్యల పరిష్కారానికి నేడు కలెక్టరేట్ ఎదుట జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ భవన నిర్మాణ కార్మిక సంఘం గుంటూరు పశ్చిమ నగర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం గుజ్జనగుండ్ల, కొరిటెపాడు, లాడ్జిసెంటర్, కంకరగుంట గేటు, బోరింగ పంప్ సెంటర్, వివిధ ప్రాంతాల్లోని అడ్డాలలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఇసుకను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవాలని, కార్మికుల ఉపాధి మెరుగుపర్చాలని, సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని తదితర డిమాండ్లతో జరిగే ఈ నిరసనలో భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం పశ్చిమ కమిటీ ప్రధాన కార్యదర్శి షేక్.ఖాసింవలి, అధ్యక్షులు డి.కోటేశ్వరావు, నాయకులు జమ్ముల కోటేశ్వరరావు, శ్రీనివాస్, షేక్.బాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆటో స్టాండ్‌లలో ప్రచారం

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్రం తెచ్చిన భారతీయ న్యాయసంహితలోని 106 సెక్షన్ అమలు నిలిపివేత, జిఒ 21 రద్దు, తదితర డిమాండ్లతో నేడు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గుంటూరు నగర ఆటోడ్రైవర్స్ యూనియన్(సిఐటియు) ఆధ్వర్యంలో మంగళవారం రైల్వేస్టేషన్, నెహ్రూ నగర్, బస్టాండ్, బి.ఆర్ స్టేడియం తదితర ఆటో స్టాండ్‌లలో డ్రైవర్లకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నగర ప్రధాన కార్యదర్శి జి.శంకరరావు, సిఐటియు గుంటూరు తూర్పు కమిటీ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, నాయకులు ఎస్.కె.సైదా, ఎస్.కె.మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

హోరా హోరీగా వాలీబాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్ : సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురం కేంద్రీయవిద్యాలయంలో జరుగుతున్న వాలీబాల్ పోటీలు హోరా హోరీగా జరిగాయి. హైదరాబాద్ రీజియన్ స్థాయిలో జరిగిన వాలీబాల్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. అండర్ 14, అండర్ 17 విభాగంలో జరిగిన లీగల్ పోటీలల్లో గెలుపొందిన జట్ల మధ్య ఫైనల్ పోటీలు జరిగాయి. అండర్ 14 విభాగంలో తెనాలి సత్తెనపల్లి జట్లు మధ్య జరిగిన మ్యాచ్ లో 2-0 తో తెనాలి జుట్టు విజయం సాధించింది. అండర్ 17 విభాగం లో వాల్తేరు సిఆర్పిఎఫ్ హైదరాబాద్ జట్లు మధ్య జరిగిన పోటీలో 3-1 తో వాల్తేరు జుట్టు గెలుపొందింది. టోర్నమెంట్ లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రీజియన్ వాలీబాల్ జుట్టుకు ఎంపికచేశారు. వీరు సెప్టెంబర్ లో ఢిల్లీ లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని సత్తెనపల్లి కేంద్రీయ విద్యాలయం ఫిజికల్ డైరెక్టర్ బి.కిరణ్ రెడ్డి తెలిపారు. అనంతరం బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడు పసుపులేటి సురేష్ ముఖ్య అతిథిగా హాజరై గెలుపొందిన జట్లకు బహుమతి ప్రధానం చేశారు. కార్యక్రమానికి సత్తెనపల్లి కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ జగదీష్ కుమార్ గుప్తా అధ్యక్షత వహించారు. రీజియన్ జట్టు ఎంపికలు కె కిరణ్ కుమార్ పర్యవేక్షణలో జరిగినట్లు ఆర్గనైజింగ్ కార్యదర్శి బి కిరణ్ రెడ్డి తెలిపారు.



అండర్ 17 వాల్తేరు జుట్టుకు ట్రోఫీని అందచేస్తున్న పసుపులేటి సురేష్ తదితరులు

చిత్తశుద్ధి ఉంటే మేయర్ పదవికి రాజీనామా చేయండి : ఎమ్మెల్యే మాధవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అసెంబ్లీలో నారా భువనేశ్వరిని అవ మానిం చిన ఘటనపై రెండేళ్ల తరువాత గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు స్పందించడం హాస్యా స్పదంగా ఉందని పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఎద్దేవా చేశారు. కౌరవ సభలో చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరిని కించపరిచే విధముగా తన తోటి నాయకుడైన వల్లభనేని వంశీ చేసిన వ్యాఖ్యలు మేయర్‌కు ఇప్పుడు గుర్తుకు రావడంపై దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. ఆ జట్టులోనే కావటి మనోహర్ నాయుడు ఉన్నారన్నారు. పవన్ కల్యాణ్, కొమ్మారెడ్డి పట్టాభిపై కావటి మనోహర్ నాయుడు చేసిన వ్యాఖ్యలను తమ పార్టీ నేతలు మర్చిపోలేదన్నారు. నిజంగా వైసిపి నేతలు తప్పు చేశారని ఇప్పటికైనా కనువిప్పు కలిగితే కావటి వెంటనే మేయర్ పదవికి, వైసిపికి రాజీనామా చేయాలన్నారు. అరాచకంలో వల్లభనేని వంశీకి కావటి మనోహర్‌నాయుడు కూడా ఏమాత్రం తీసి పోలేదని గుర్తు చేశారు. నగర మేయర్ టిడిపి కార్పొరేటర్లు ప్రాతి నిధ్యం వహించే డివిజన్లలో రోడ్లు వేయనీకుండా అడ్డుకొన్నారని, మొన్నటి వరకు టిడిపి నేతలు కనీసం ఫ్లెక్సీ కూడా కట్టుకోలేని పరిస్థితి కల్పించారని ధ్వజమెత్తారు. కావటిని తాము క్షమించే ప్రసక్తేలేదన్నారు. తమ కూటమిలోకి ఆయన వచ్చినా రానివ్వబోమన్నారు.

దాడులకుపాల్పడటం సరికాదు

వైసిపి నేతలు చంద్రగిరి, డైమండ్ బాబు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



టిడిపి నాయకులు, కార్యకర్తలు తమపార్టీ కార్యాలయాలు, నాయకులపై దాడులకు దిగడం సరికాదని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, నగర డిప్యూటీ మేయర్ డైమండ్‌బాబు పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు కార్యాలయంపై సోమవారం దాడి నేపథ్యంలో నిందితులపై చర్యలు తీసుకోవాలని వారు మంగళవారం ఎస్‌పికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చంద్రగిరి, డైమండ్‌బాబు మీడియాతో మాట్లాడుతూ గతంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా నాయకుల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఉండేది... నేడు అటువంటి పరిస్థితులు కనబడడం లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల తరువాత టిడిపి అధికారంలోకి వచ్చిన గంట నుంచే వైసిపి నాయకులు, కార్యకర్తలపై దాడులు మొదలయ్యాయని తెలిపారు. పలువురు కార్పొరేటర్లపై నాయకులపై నిత్యం దాడులకు పాల్పడుతున్నారని, వైయస్ రాజశేఖరరెడ్డి గారి విగ్రహాలను ధ్వంసం చేస్తున్నారని ఇది సరికాదన్నారు. ఫలితాలు వచ్చిన వెంటనే మాజీ మంత్రి విడుదల రజిని కార్యాలయంతోపాటు పలువురు నేతల ఇళ్లపై దాడి జరిగిందన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్లలో ఆధారాలతో సహా ఫిర్యాదులు చేస్తుంటే పోలీసులు కనీసం ఎఫ్.ఐ.ఆర్ లు నమోదు చెయ్యడం లేదని చర్యలు తీసుకోవడం లేదన్నారు. గుంటూరులో టిడిపి, జనసేన కంటే బలమైన నాయకులు, కార్యకర్తలు వైసిపి పార్టీకి వున్నారని అయినా మేం ఇప్పుడూ ఎప్పుడూ ఇటువంటి దాడులను ప్రోత్సహించలేదన్నారు. జరుగుతున్న దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవలసిన బాధ్యత కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌పై ఉందన్నారు. తన కార్యాలయంపై సోమ వారం డొంకరోడ్డుకు చెందిన రౌడీషీటర్లు దాడికి పాల్పడ్డారని తెలిపారు. ఇటువంటి విష సంస్కృతిని నివారించాల్సిన అవసరం ఉందన్నారు. ఇటువంటి దాడులు పునరావృతం అయితే వైసిపి నాయకులు, కార్యకర్తలు రోడ్లెక్కే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. వీరి వెంట వైసిపి తూర్పు నియోజకవర్గం ఇన్‌ఛార్జి నూరిఫాతిమా, కార్పొరేటర్లు ఈచంపాటి ఆచారి, నిమ్మల వెంకట రమణ, బూసిరాజలత, పూనురునాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!



ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ